నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY








సంపుటి : 13 సంచిక : 71 రంగారెడ్డి బుధవారం 08 జులై 2026 ఎడిటర్ : బవనారి రవికుమార్ 08-07-2026 Wednesday పేజీలు : 8 వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada


## రెవెన్యూ, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్

# కార్యాలయాలకు మహర్దశ



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:

రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు ఆధునిక సేవలు అందించాలనే లక్ష్యంతో దశల వారీగా తహశీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై మంగళవారం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహశీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు రూ.263 కోట్లతో, అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్లతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి రూ.360 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. **(మిగతా 3 లో..)**

## కోటి మంది మహిళలను

# కోటీశ్వరులను చేస్తాం..

## సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:

తమ ప్రభుత్వంలో మహిళలకు ప్రథమ ప్రాధ్యాన్యత ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నాచారంలోని తెలంగాణ ఫుడ్ ఇండస్ట్రీలో అంగన్‌వాడీ పిల్లకు పౌష్టికాహారం అందించేలా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన బాలామృతం ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నాచారంలో ప్రారంభించిన బాలామృతం ప్లాంటు నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఆలోచనలతోనే ఈ కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు పరిశ్రమగా మారిందన్నారు. తమ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధ్యాన్యత ఉంటుందని, ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరు మీదే నడుస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు.

**ఏడాదికి రూ.27 వేల కోట్లు విద్యపైనే..**



రాష్ట్రంలో ఇప్పటి వరకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిరుపేదలకు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో భూముల ధరలు వజ్రాలకు మించి ధర పలుకుతోందని అన్నారు. **(మిగతా 3 లో..)**

## అవుట్‌సోర్సింగ్

# ఉద్యోగుల బ్యాంక్ వివరాలు డిజిటల్..

### సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:



ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మంగళవారం సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం చెల్లింపులు చేసినా సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**100 రోజుల్లో నివేదిక సమర్పించాల్సిందే:**

డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తిస్థాయి కసరత్తు చేసేందుకు ఒక ప్రత్యేక కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కమిటీ రాబోయే 100 రోజుల్లోగా తన సమగ్ర నివేదికను సమర్పించి, ఈ ప్రక్రియను ఒక కొలిక్కి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడువు విధించారు. డిజిటల్ గవర్నెన్స్ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి, అవసరమైన చట్టాలను రూపొందించాలన్నారు. పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ ముందుకు వెళ్లాలని ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ముఖ్యం అన్నారు.

# 'నా శాఖతో అతనికేం సంబంధం?'..

### కడియం శ్రీహరిపై మంత్రి సురేఖ ఏఐసీసీకి ఫిర్యాదు

నిర్భయవార్త ప్రతినిధి :వరంగల్:



తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి మంత్రి కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. తన శాఖలో కడియం శ్రీహరి జోక్యం చేసుకోవడం పట్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్న దేవాదాయ కమిషనర్ ఆఫీసులో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని నా ఆఫీసులో నాకు తెలియకుండా నా శాఖ అధికారులతో రివ్యూ చేయడం ఏంటని సురేఖ మండిపడ్డారు. ఈ మేరకు కడియం శ్రీహరి తీరుపై ఏకంగా కాంగ్రెస్ అధిష్టానానికి మంత్రి ఫిర్యాదు చేయడంతో ఇద్దరి మధ్య పొలిటికల్ కుమ్ములాట హాట్ టాపిక్‌గా మారింది. **(మిగతా 3 లో..)**

# దేశంలో 'ఈ-25 పెట్రోల్' లాంచ్ వార్తలు..

### తీవ్రంగా ఖండించిన కేంద్రం





ఢిల్లీ: నిర్భయవార్త ప్రతినిధి :

దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన 'ఈ-25' పెట్రోల్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారంటూ మీడియాలో వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఖండించింది. అలాంటి ప్రచారాలు ముమ్మాటికీ అబద్ధమని అని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశంలో 20 శాతం ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ విజయవంతంగా అమలువుతున్న వేళ అదే లక్ష్యాన్నే మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారించిందని తెలిపింది. కానీ, **(మిగతా 3 లో..)**

# సింగరేణి కార్మికులకు గుడ్ న్యూస్..

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన




నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:

కేంద్ర ప్రభుత్వం సింగరేణికి అనేక సహాయ సహకారాలు అందజేస్తోందని.. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ.. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా చొరవ తీసుకున్నామని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు వేలం పాటలో పాల్గొనేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. మరో 35 ఏళ్లకు సరిపడే బొగ్గు నిల్వలు నైనీ కోల్ బ్లాక్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో సిగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉ ందన్నారు. తెలంగాణలో లక్షలాది గుండెచప్పుడు సింగరేణి అని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను ఆయన మరో గుడ్ న్యూస్ చెప్పారు. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ సింగరేణికే ఇస్తున్నామని.. అందుకు ప్రధాని కూడా అంగీకరించారని తెలిపారు. తాడిచెర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40 నుంచి 50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయవచ్చని స్పష్టం చేశారు. అదే విషయంపై మంగళవారం నిర్ణయం కూడా తీసున్నామని వెల్లడించారు. ఇది సింగరేణికి ఎంతో ఉపయోగకరంగా మారబోతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు.

# కేటీఆర్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఫైర్

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:




తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసులో తీర్పుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ కేటీఆర్ చేసిన విమర్శలను ఆయన మంగళవారం తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తాను ఇచ్చిన తీర్పును కేటీఆర్ సరిగ్గా అర్థం చేసుకోలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. అనర్హత తీర్పుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఎంతమాత్రం సరికావని ఈ అంశంలో తాను ఇచ్చిన 54 పేజీల తీర్పు కాపీని కేటీఆర్ పూర్తిగా చదవాలన్నారు. తీర్పు కాపీని పూర్తిగా చదవిన తర్వాతే మాట్లాడాలన్నారు. ఎమ్మెల్యేల అనర్హతపై నా పరిధిలో నేను నిర్ణయం తీసుకున్నాను. ప్రతీది రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు. అయితే ఈ వ్యవహారంలో స్పీకర్ నేరుగా కేటీఆర్ విమర్శలకు కౌంటర్ ఇవ్వడంతో తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఈ అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# టీఆర్ఎస్ పేరు వివాదం..

### కవితకు హైకోర్టు సంచలన ఆదేశం

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:




తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు ఖరారు విషయంలో ఈసీ నోటీసులకు సమాధానం చెప్పాలని కల్వకుంట్ల కవితను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. టీఆర్ఎస్ పార్టీ పేరుపై పెద్ద ఎత్తన అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయని అందువల్ల పార్టీ పేరు కోసం ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని కవితకు ఈసీ లేఖ రాసిన నేపథ్యంలో ఈసీ లేఖపై కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపినన న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడం అంటే ఎన్నికల సంఘం విధుల్లో జోక్యం చేసుకోవడమే అవుతుందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. కాబట్టి తాము ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. జూన్ 23న ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులకు సరైన రీతిలో సమాధానం ఇవ్వాలని కవితను ఆదేశించింది. ఈసీ లేవనెత్తిన అభ్యంతరాలన్నింటికీ ఈ సమాధానంలో వివరణ ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది.

**(మిగతా 3 లో..)**


నిర్భయవార్త
సంపాదకీయం
బుధవారం 08 జులై 2026

# ఎల్‌నినో భయాలు

ఈ ఏడాది ఎల్‌నినో భయాలు క్రమంగా ఆవరిస్తున్నాయి. జూన్‌లో తక్కువ స్థాయిలో మొదలైన ఎల్‌నినో ప్రభావం జూలై- సెప్టెంబర్ మధ్య బలపడి తీవ్రరూపం దాల్చి శీతాకాలం వరకు కొనసాగుతుందని ఐక్య రాజ్య సమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తాజా ప్రకటన ఆందోళనలను ఇంకా ఎక్కువ చేసింది. ఎల్‌నినో తీవ్ర ప్రభావిత ప్రాంతాలను రెడ్ జోన్లుగా గుర్తించి అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. భారత దేశంలో 724 జిల్లాలుండగా 111 డేంజర్ (రెడ్) జిల్లాల జాబితా విడుదల చేయగా వాటిలో మన రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలు ఉండటం మిక్కిలి ఆందోళన కలిగించే విషయం. సాగునీటి వసతి 25 శాతం లోపు కలిగిన జిల్లాలను 'ప్రమాద' ప్రాంతాలుగా పేర్కొన్నారు. ప్రపంచాన్ని భయపెడుతున్న ఎల్‌నినో కోరలు ఆంధ్రప్రదేశ్‌నూ చేరతాయని కొన్ని నెలల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అంత తీవ్రత ఖరీఫ్ మొదట్లో తొలకరి సమయంలో ఉండకపోవచ్చని ధీమాకు పోయింది. నైరుతి రుతుపవనాలు ఊహించినదానికంటే ఐదారు రోజులు ఆలస్యంగా రాష్ట్రంలోకి ప్రవేశించాయి. తొలుత వర్షాలు మురిపించి ఆపై ముఖం చాటేశాయి. జూన్ సాధారణ వర్షపాతంలో 63 శాతం తక్కువ నమోదైంది. ఏ జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. జూన్‌లో అసాధారణ ఉష్ణోగ్రతలతో ప్రజలు ఏ విధంగా అల్లాడారో చూశాం. ఆదిలోనే తీవ్ర వర్షాభావం నెలకొని రాబోయే కాలానికి ఎల్‌నినో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు అంతగా లెక్కలోకి రావని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. వాతావరణ సరళిలో అసాధారణ మార్పులను ఎల్‌నినోగా పేర్కొంటుండగా, మధ్య, తూర్పు పసిఫిక్ మహా సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం ద్వారా ఎల్‌నినో ఏర్పడుతుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకో మారు ఎల్‌నినో వస్తుంది. వరదలు, కరువు, తుపాన్లు, వడగాలులను తీసుకొస్తుంది. ఆహారోత్పత్తి, నీరు, ఆరోగ్య వ్యవస్థ, ప్రజల మౌలిక వసతులపై ప్రతికూల ప్రభావం కలిగిస్తుంది. పసిఫిక్ ఖండంపైనే కాదు అన్ని ఖాండాలపైనా, వాటిల్లోని అన్ని దేశాలు, ప్రాంతాలపైనా ఎల్‌నినో ప్రభావం తథ్యం. భారతదేశం విషయానికొస్తే 2002లో వచ్చిన ఎల్‌నినో అత్యధిక నష్టం కలిగించిందని చెబుతారు. ఆ ఏడాది సగటు సాధారణ వర్షపాతంలో 39 శాతం పైన తక్కువ నమోదైంది. 2014, 2018, 2023 సంవత్సరాల్లోనూ మన దేశంపై, మన రాష్ట్రంపై దాడి చేసింది. ఎల్‌నినో దూసిన కత్తికి ప్రధానంగా బలయ్యేది వ్యవసాయ రంగం, దానిపై ఆధారపడ్డ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు. వాతావరణ శాఖ హెచ్చరికలుబట్టి ఖరీఫ్ మధ్యలో ఎల్‌నినో బలపడి సంవత్సరమంతా తిష్టవేస్తుంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ ప్రభావం కొనసాగుతుంది. వచ్చే ఏట వేసవి అసాధారణ ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో చాలా హాట్‌గా ఉంటుందనీ చెబుతున్నారు. కృష్ణా డెల్టా, రాయలసీమ ప్రాజెక్టులకు కృష్ణా నదీ ఎగువనున్న మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసే వర్షాలే ఆధారం. ప్రస్తుతం అక్కడ సరైన వానల్లేవు. ప్రాజెక్టుల్లో నీళ్లు లేవు. జూలైలో 40 శాతం వర్షాలే కురుస్తాయని వాతావరణ శాఖ నెల ప్రారంభంలో అంచనా వేసింది. ఆ తర్వాత కూడా వర్షాలకు గ్యారంటీ లేదు. వ్యవసాయ రాష్ట్రంలో సేద్యం దెబ్బతింటే ఒక్క రైతులకే కాదు అన్ని వర్గాలకు, చివరికి ప్రభుత్వానికీ నష్టం. సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి సరైన ముందు చూపు, సమగ్ర ప్రణాళిక ఉండాలి. ప్రత్యామ్నాయ పంటల సాగు, పశువులకు తాగునీరు, గ్రాసం, వ్యవసాయ కార్మికులకు ఉపాధి, సాగు, తాగునీరు అత్యవసరం అవుతాయి. వచ్చేది సాధారణ కరువు కాదు ఆకస్మిక కరువుగా చెబుతున్నారు. ఆ దృష్టితో ప్రభుత్వం చర్యలకు సమాయత్తం కావాలి. రెడ్ జాబితాలోని జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఎల్‌నినోను ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించి ప్రత్యేక నిధులిచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి. కరోనాలో మాదిరి 'యాక్ట్ ఆఫ్ గాడ్' పేరిట కేంద్రం చేతులెత్తేసే ప్రమాదం ఉన్నందున అప్రమత్తత వహించాలి.

# ఐశ్వర్యం నీడలో అప్పుల బతుకులు!


సంపద పోగుపడుతోంది, సామాన్యుల సంక్షేమం సన్నగిల్లుతోంది! వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం శాతాలు మొదలైన స్థూల ఆర్థిక సూచికలు భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యదాయకంగా, పురోగమన పథంలో ఉన్నదని మనకు విదితం చేస్తాయి. సగటు కుటుంబ బడ్జెట్‌ను పరిశీలించండి. స్థూల ఆర్థిక సూచికలు ఆవిష్కరిస్తున్న దృశ్యానికి భిన్నమైన వాస్తవ చిత్రం మనకు కనపడుతుంది. స్పష్టంగా చెప్పాలంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఏమంత శ్రేయోదాయకంగా లేదు. సంపద సృష్టికర్తలైన అత్యధిక ప్రజలకు నిజమైన సంక్షేమం లభించడం లేదు. గత పన్నెండు సంవత్సరాలుగా ఆర్థిక వ్యవస్థ సృష్టిస్తున్న సంపద, వ్యక్తిగత కొనుగోలు శక్తి-- ఒక వ్యక్తి తన ఆదాయంతో సమకూర్చుకోగల సరుకులు, సేవలు-- మధ్య అతి ముఖ్యమైన లంకె తెగిపోయింది. అనేక వృత్తులు, ఉద్యోగాలలో వాస్తవ వేతనాలు (ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేసినవి) పెరగలేదు. అసంఖ్యాక శ్రామిక కుటుంబాలు తమ జీవన వ్యయాలకు రుణాలు తీసుకోవల్సిన అగత్యంలో ఉన్నాయి. ఇదొక నిష్ఠుర నిజం. క్రెడిట్ కార్డు రుణాలపై ఆధారపడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అంతకంటే ముఖ్యంగా పదే పదే ఆ రుణాలు తీసుకోవడమూ పెరుగుతోంది. బంగారు ఆభరణాలు మొదలైన స్త్రీ ధనాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడమూ విరివిగా జరుగుతోంది. స్తంభించిన వేతనాలు, పెరుగుతున్న వినియోగ వ్యయాలకు మధ్య అంతరాన్ని పూడ్చుకునేందుకు రుణాలు చేయడం తప్పనిసరి అయిపోయింది. వర్తమాన జీవన వాస్తవమిది. మన సమాజంలో ఇప్పుడు వేతన--రుణ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉన్నది ఆ కఠోర వాస్తవం స్పష్టం చేస్తోంది. వేతనాలు వస్తున్నాయి. అవి సరిపోవడం లేదు. అప్పులు చేయడం అనివార్యమవుతోంది. విశేషమేమిటంటే అవి సులభంగా లభిస్తున్నాయి. వాటిని తీర్చడమే సమస్యవుతోంది. వేతన ఆదాయం జీవన వ్యయాలకు సరిపోకపోవడమే అందుకు కారణం. తత్ఫలితంగా శ్రామిక శ్రేణులు అపాయకరమైన ఆర్థిక దుస్థితిలోకి జారిపోతున్నాయి. భారతీయ కార్మికుల ఆర్థిక ఇక్కట్లకు ధరల పెరుగుదలను కారణంగా చూపడం సమంజసం కాదు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా చమురు సరఫరాలకు అంతరాయం కలగడంతో ధరలు పెరిగిన మాట నిజమే. అయితే మనుగడకు రుణాలు తీసుకోవల్సిన అగత్య మేర్పడడానికి కారణం అది మాత్రమే కాదు. జాతి సంపద సృష్టి అవుతున్న, పంపిణీ జరుగుతున్న తీరు తెన్నులే ఆ అసంగత పరిస్థితికి కారణాలని చెప్పి తీరాలి. ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా పురోగమిస్తోంది. స్టాక్ మార్కెట్ సూచీలు సదా ఊర్ధ్వ దిశలో ఉంటున్నాయి. అయితే పెరుగుతున్న జాతి సంపద, దానిని సృష్టించడంలో కీలకపాత్ర వహిస్తున్న శ్రామిక శ్రేణులకు సక్రమంగా, న్యాయబద్ధంగా పంపిణీ అవుతుందా? లేదు అనేదే కచ్చితమైన సమాధానం. వేతన అంతరాలు సుదీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం స్థూల ఆర్థిక వ్యవస్థపై కూడా ఉంటుందనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. వేతనాలు బెత్తెడుగా ఉండిపోవడం, వ్యయాలు బారెడు కావడం వల్లే భారతీయ కుటుంబాల నికర పొదుపు మొత్తాలు రికార్డు స్థాయిలో తగ్గిపోతున్నాయి. స్థూల జాతీయ వినియోగ ఆదాయం (జీఎన్‌డీఐ)లో 7 నుంచి 8శాతంగా ఉండే ఈ పొదుపు మొత్తాలు 2022--23 ఆర్థిక సంవత్సరంలో 5.2శాతానికి తగ్గిపోయాయి. అయితే స్థిర, చరాస్తులు తాకట్టు పెట్టి తీసుకునే రుణాలు 2014లో 3శాతం నుంచి 2023లో 5.7శాతానికి పెరిగాయి. ఫలితంగా చెల్లించవలసిన అప్పుల మొత్తాలు కూడా గణనీయంగా పెరిగిపోయాయి. కోవిడ్ ఉపద్రవంలో కుదేలయిన దేశ ఆర్థిక వ్యవస్థ ఆ తరువాత బాగా కోలుకున్నదనడంలో సందేహం లేదు. అయితే ఈ ఆర్థిక పునరుద్ధరణ వేతనాల నైష్పత్తిక పెరుగుదల వల్ల కాకుండా కార్పొరేట్ లాభాల పెరుగుదల వల్లే అన్నది ఒక చేదు సత్యం. 2014--25 సంవత్సరాల మధ్య అనియత కార్మికుల వాస్తవ వేతనాల వార్షిక పెరుగుదల రేటు 1.5శాతం కంటే తక్కువగా ఉన్నది. ఈ వేతన అణచివేతకు తోడు పట్టణ ప్రాంతాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడడంతో శ్రామిక శ్రేణుల జీవన పరిస్థితులు మరింత అధ్వానమయ్యాయి. పైగా 2018--19 సంవత్సరం నుంచి తిరోగమన వలసలు (ఉద్యోగాలు హరించుకుపోవడం, ఉపాధి అవకాశాలు మృగ్యమవడంతో పట్టణాలు, నగరాలకు వలసలు వచ్చినవారు తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోవడం) పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే వ్యవసాయేతర రంగాల నుంచి వ్యవసాయరంగ ఉపాధులకు లక్షలాది శ్రామికులు తిరిగి వెళ్ళిపోతున్నారు.




వేతనాల పెరుగుదలకు ప్రత్యామ్నాయంగా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికంగా పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి అదెంతవరకు ఉపకరిస్తుంది? సమాధానం స్పష్టమే. వేతనాలు పెరగకపోయినా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికమవడంతో వినియోగదారు రుణాల స్వభావం మౌలికంగా మారిపోయింది. కుటుంబ రుణాలు ఇతోధికంగా పెరిగిపోవడం కంటే శ్రామిక ప్రజలు తమ జీవన వ్యయాల కోసం గణనీయంగా ఆ రుణాలపై ఆధారపడుతున్న పరిస్థితే బాగా కలవరపరుస్తోంది. ఇది దేశానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ అత్యవసర రుణాలు దేశ ప్రగతికి ఆటంకమవుతాయని పలువురు హెచ్చరిస్తున్నారు. సంప్రదాయంగా భారతీయ కుటుంబాలు తమకు డబ్బు అవసరమయినప్పుడు గృహాలు, పొలాలు, బంగారం మొదలైన వాటిని తనఖా పెట్టడం పరిపాటి. దీనివల్ల వారి తక్షణావసరాలు తీరడంతో పాటు స్థిర, చరాస్తుల రూపంలో భద్ర భవిష్యత్తును సమకూర్చుకునేందుకు కూడా దోహదం జరిగేది. మనుగడ కోసమే రుణాలు తీసుకోవలసిరావడం పరిస్థితులను సంక్లిష్టం చేస్తోంది. సురక్షితం కాని వ్యక్తిగత రుణాలు, వినియోగదారు రుణాల వార్షిక పెరుగుదల రేట్లు ఇటీవలి సంవత్సరాలలో 22 నుంచి 25శాతానికి పెరిగాయని ఆర్థిక సుస్థిరతపై ఆర్బీఐ (భారతీయ రిజర్వ్ బ్యాంక్) నివేదికలు వెల్లడించాయి. క్రెడిట్ కార్డులపై రుణాలు తీసుకోవడం, ఆభరణాలు మొదలైనవి తాకట్టు పెట్టి అప్పులు చేయడమనేది బాగా పెరిగిపోయింది. అయితే ఈ రుణాలు తిరిగి చెల్లించడం అంత చురుగ్గా జరగడం లేదు. ఫలితంగా వెండి, బంగారు ఆభరణాలకు సంబంధించి, చెల్లించని రుణాల మొత్తం రూ. 3.38 లక్షల కోట్లకు పెరిగిందని ఆర్బీఐ నివేదికలు వెల్లడించాయి. ఏటా ఈ రుణ బాకీల మొత్తం భారీ స్థాయిలో పెరుగుతూనే ఉన్నది. శ్రామిక కుటుంబాలు అధిక వడ్డీలతో సమకూర్చుకుంటున్న స్వల్పకాలిక రుణాలను తమ తక్షణావసరాలకు వినియోగించుకుంటున్నాయి. ఈ రుణాలను అవి తమ భావి ఆర్థిక స్తోమత భరోసాతోనే తీసుకుంటున్నాయనేది గమనార్హం. రేపో, మాపో లేదా ఆ తరువాతో తప్పకుండా అప్పు తీర్చగలమనే విశ్వాసంతోనే శ్రామిక కుటుంబాలు ఇలా రుణగ్రస్తమవుతున్నాయి. ఇదొక అవివేక వ్యవహారం. ఎందుకని? ఈ తరహా రుణాలు దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను నిర్లక్ష్యం చేయడమే, సందేహం లేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే శ్రామిక కుటుంబాల శ్రేయస్సుకు ఈ రుణాలు తోడ్పడవు. అప్పు చేసి పప్పు కూడు లాంటి ఈ రుణాలు, ఆదాయం పెరుగుదలతో సమకూరే ఆర్థిక భద్రతను ఇవ్వలేవు. ఒక స్థిరమైన సామాజిక భద్రతా వలయాన్ని సమకూర్చవు. ఇటువంటి సులభ రుణాల వల్ల శ్రామిక కుటుంబాల ఆర్థిక నష్టాలు రెట్టింపు అవుతాయి. ఈ కఠోర సత్యంతో పాటు వాస్తవ వ్యవసాయ వేతనాల వార్షిక పెరుగుదల 1శాతం కంటే తక్కువగా ఉందనే యథార్థాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. ఈ వాస్తవాలు స్పష్టం చేస్తున్నదేమిటి? దేశ ఆర్థిక వ్యవస్థ ఒక తీవ్ర సంక్షోభం ముంగిట ఉందనే కాదూ? దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో ఉన్నదని స్థూల ఆర్థిక సూచికలు స్పష్టం చేస్తున్నాయి. నిజమే. అయితే ఆ వృద్ధి సమరీతిలో లేదు. ఈ అసమాన వృద్ధి నుంచి సమ్మిళిత, సుస్థిర అభివృద్ధికి మనం పురోగమించాలి. ఇది జరగాలంటే సరఫరా సంబంధిత ప్రోత్సాహకాల (కార్పొరేట్ పన్ను కోతలు, మూలధన రాయితీలు వగైరా)కు స్వస్తి చెప్పాలి. వాటికి బదులుగా శ్రామిక శ్రేణులకు శ్రేయస్సును సమకూర్చే విధానాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇది తప్పనిసరి. కార్పొరేట్ సంస్థలకు సమకూర్చిన లబ్ధి పారిశ్రామిక ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంపొందించిందే కానీ, శ్రామిక శ్రేణుల వేతనాలలో వాస్తవ పెరుగుదలకు దోహదం చేయలేదు. తప్పనిసరి వినియోగ వస్తువులు, నిత్యావసర సేవలపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను హేతుబద్ధీకరించాలి. ప్రాథమిక మానవ అవసరాలను తీర్చే ఆ సరుకులు, సేవలు శ్రామిక కుటుంబాలతో సహా సమస్త అల్పాదాయ వర్గాల వారికి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. శ్రామిక శ్రేణులపై పన్నుల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రగతిశీల ప్రత్యక్ష పన్నులపై మరింతగా ఆధారపడేందుకు ప్రభుత్వం సుముఖత, సంసిద్ధత చూపాలి. ఇందులో భాగంగా శ్రమ--సాంద్ర సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమలను పునశ్శక్తిమంతం చేయాలి. భారీ ఉపాధి అవకాశాలు కల్పించే ఈ ఎమ్ఎస్ఎమ్ఈ రంగాన్ని పూర్తిస్థాయిలో పునరుజ్జీవింప చేసినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ సకల జనులకు శ్రేయోదాయకంగా పురోగమిస్తుంది. విస్మరించకూడని, తక్షణమే చేపట్టవలసిన మరో చర్య జాతీయ కనీస వేతనం పెంపుదల. ఇది లక్షలాది కార్మికులకు ఆర్థిక భద్రతను సమకూర్చుతుంది. ఉత్పాదకత పెరిగి ఆర్థిక వ్యవస్థ పురోగతి వేగవంతమవుతుంది. ఆరోగ్య భద్రత, విద్యారంగాలకు బడ్జెట్ కేటాయింపులను విధిగా పెంచి తీరాలి. విద్యా వైద్యరంగాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక నష్టాలు చవిచూస్తున్నాయి. ఆ నష్టాలను భరించడం తమకు మోయలేని భారమని అనేక రాష్ట్రాల పాలకులు సణుగుతున్నారు. కనుక కేంద్ర ప్రభుత్వమే ఆ నష్టాలను భరించేందుకు ముందుకు రావాలి. ఇది జరిగితే ఆరోగ్య భద్రత, పిల్లల విద్యా సదుపాయాల విషయంలో కుటుంబాలకు ఆర్థికభారం తగ్గుతుంది. తమ ఆదాయాన్ని ఇష్టానుసారం వ్యయం చేయగల వెసులుబాటు వాటికి లభిస్తుంది. ఇటువంటి మార్పుతో మనుగడ కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నుంచి శ్రామిక కుటుంబాలు బయటపడతాయి.

# మహిళలంటే ఏఐకి అలుసే!

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) గురించే చర్చ జరుగుతోంది. మనుషుల పనిభారాన్ని తగ్గిస్తూ, అద్భుతాలు సృష్టిస్తోందని అంటున్న ఈ కృత్రిమ మేధస్సు, అంతర్లీనంగా ఒక ప్రమాదకరమైన జాడ్యాన్ని కూడా తనలో దాచుకుంటోంది. అదే 'లింగ వివక్ష'. ఇటీవల ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం విడుదల చేసిన ఒక నివేదిక ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. 'లేడీస్ అంటే ఏఐకి అలుసు' అనే పచ్చి నిజాన్ని ఈ నివేదిక సమాజం ముందు పెట్టింది. అయితే ఈ వివక్షకు, సమాధానాల్లో దొర్లే తప్పులకు సాంకేతిక పరిభాషలో చెప్పుకునే ఎలాంటి 'బగ్' కారణం కాకపోవడమే ఇక్కడ అసలు ట్విస్ట్. ఏఐ అనేది ఒక ఖాళీ కాగితం వంటిది. దానికి సొంతంగా ఆలోచించే హృదయమో, నైతికతతో కూడిన మేధస్సో ఉండవు. ఇంటర్నెట్‌లో దశాబ్దాలుగా అందుబాటులో ఉన్న కోట్లాది మానవ సంభాషణలు, పుస్తకాలు, వార్తలు, సమాచారాన్ని (డేటా) విశ్లేషించి అది సమాధానాలు నేర్చుకుంటుంది. అంటే, మన సమాజంలో శతాబ్దాలుగా వేళ్లూనుకుపోయిన పితృస్వామ్య పోకడలను, స్త్రీలపై ఉన్న పక్షపాతాలను, మూస పద్ధతులను ఏఐ తన గురువులైన మనుషుల నుంచే నేర్చుకుంది. మనుషుల అవలక్షణాలు, పక్షపాతాలే ఏఐకి పాఠాలుగా మారాయి. ఐక్యరాజ్యసమితి పరిశోధనల ప్రకారం.. అధ్యయనం చేసిన ఏఐ వ్యవస్థల్లో 44శాతం వ్యవస్థలు తీవ్రమైన లింగ వివక్షను, 25శాతం కంటే ఎక్కువ వ్యవస్థలు లింగ, జాతి వివక్షను స్పష్టంగా ప్రదర్శించడమే దీనికి నిదర్శనం. వివిధ సందర్భాలలో ఏఐ ఇచ్చిన సమాధానాలను పరిశీలిస్తే, స్త్రీలపై దానికి ఉన్న చులకనభావం, అలుసు స్పష్టంగా అర్థమవుతుంది. సాధారణ వాక్యాలను పూర్తి చేయమని ఏఐని అడిగినప్పుడు, అది పురుషులను వ్యాపారాలు, నాయకత్వం, వృత్తిపరమైన విజయాలతో ముడిపెట్టింది. అదే సమయంలో స్త్రీలను ఇల్లు, వంటగది, కుటుంబం, పిల్లల సంరక్షణకే పరిమితం చేస్తూ సమాధానాలిచ్చింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో స్త్రీలను స్వతంత్ర వ్యక్తులుగా కాకుండా, కేవలం ఆస్తిగా లేదా పురుషులకు లోబడిన లైంగిక వస్తువులుగా చిత్రీకరించేలా ఏఐ ప్రవర్తించింది. ఇందులో ప్రతి అయిదు సమాధానాలలో ఒకటి లింగ వివక్ష లేదా స్త్రీ వ్యతిరేకతతో కూడి ఉండటం గమనార్హం. ఇంతటితో ఆగకుండా, ఇంటర్నెట్ వేదికగా మహిళలపై జరిగే హింసకు, వేధింపులకు కూడా ఏఐ ఒక సాధనంగా మారుతోంది. మహిళా హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులలో నలుగురిలో ఒకరు ఏఐ సహాయంతో ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కొంటుండటం ఆందోళనకరం. మహిళల అనుమతి లేకుండా వారి ముఖాలను మార్చేసి (డీప్‌ఫేక్) అశ్లీల చిత్రాలు, వీడియోలు సృష్టించడానికి ఏఐని వాడుతూ డిజిటల్ ప్రపంచంలో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. కోట్లాది మంది ప్రజలుఇ--మెయిళ్లు రాయడానికి, ప్రెజెంటేషన్లు సిద్ధం చేయడానికి, కంటెంట్ సృష్టించడానికి నిత్యం ఏఐని వాడుతున్న తరుణంలో, అది ఇలాంటి వివక్షతో కూడిన సమాధానాలు ఇస్తూపోతే సమాజంలో లింగ వివక్ష మరింత బలపడే ప్రమాదం ఉంది. అందుకే ఐక్యరాజ్యసమితి హెచ్చరించినట్లుగా... మానవ మేధస్సును భర్తీ చేయడం కంటే, మానవుల దుర్మార్గాలు, పక్షపాతాలు, వివక్షలను ఏఐ వారసత్వంగా తీసుకోకుండా చూడటమే ప్రస్తుతం మానవాళి ముందున్న అతిపెద్ద సవాలు. ఏఐ అభివృద్ధి దశ నుంచి దాని వినియోగం వరకు ప్రతిచోటా లింగ సమానత్వాన్ని, మహిళల హక్కులను జోడించాల్సిన అవసరం ఉంది. ఏఐకి కేవలం కోడింగ్ మాత్రమే కాదు, 'సమానత్వం' అనే పాఠం కూడా నేర్పినప్పుడే అది నిజమైన ప్రగతికి బాటలు వేస్తుంది.



# దేశమంతా తెలంగాణ రోడ్లవైపు చూసేలా అభివృద్ధి

**ఇబ్రహీంపట్నం ప్రజలతో నాకు ప్రత్యేక అనుబంధం...**
**ఆ అనుబంధంతోనే రూ.338కోట్లతో రహదారుల నిర్మాణం...**
**మరోసారి అవకాశం కల్పిస్తే పూర్తిస్థాయిలో అభివృద్ధి....**
**రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి....**
**వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు, మంత్రి వెంకన్న సహకారం....**
**సీఎం రేవంత్ నాయకత్వంలో నియోజకవర్గం రూపురేఖలు మార్చుతా....**
**నాడు ప్రజలకు మాటిచ్చా... నేడు చేసి చూపిస్తున్నా....**
**ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి....**
**149కి.మీ. మేర 14 హ్యామ్ ఫోర్ లేన్ రహదారులకు శంకుస్థాపన...**
**తొర్రూర్ లో శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి...**
**పాల్గొన్న ఎంపీలు , ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు...**





**నిర్భయవార్త ప్రతినిధి : అబ్దుల్లాపూర్మెట్:**
దేశమంతా తెలంగాణ రోడ్లవైపు చూసేలా అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మించి, ప్రజలకు అంకితమిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రూ. 13,006 కోట్లతో 34 ప్యాకేజీల్లో 6,092 కి.మీ పొడవున 441 హ్యామ్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. రూ. 338 కోట్లతో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో 149 కి.మీ మేర 14 ఆధునిక హ్యామ్ ఫోర్ లేన్ రహదారుల నిర్మాణ పనులకు తొర్రూర్ లో మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, శంకర్ నాయక్, రాష్ట్ర రోడ్ డెవలప్ మెంట్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు మునగనూర్ వద్ద మంత్రి కోమటి రెడ్డికి ఘనస్వాగతం పలికిన ఎమ్మెల్యే మల్ రెడ్డి... తొర్రూర్ వరకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రోడ్ షో నిర్వహించారు. శంకుస్థాపన అనంతరం, తొర్రూర్ లో జరిగిన సభలో వారు మాట్లాడారు.

**దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర రహదారి వ్యవస్థః మంత్రి కోమటిరెడ్డి**
ఈ ప్రాజెక్టుల ద్వారా తుర్కయాంజాల్, తొర్రూర్, పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు, హయత్‌నగర్ తదితర ప్రాంతాలకు ఆధునిక సెంట్రల్ లైటింగ్‌తో కూడిన నాలుగు లేన్ల రహదారులు అందుబాటులోకి రానున్నాయని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రమాదాలు తగ్గడంతో పాటు ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. అదే సమయంలో పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగి ఈ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన రహదారులను నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 13,006 కోట్లతో 34 ప్యాకేజీల్లో 6,092 కి.మీ పొడవున 441 హ్యామ్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం ద్వారా తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిచే రహదారి వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధే మా ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి....దేశం మొత్తం తెలంగాణ రోడ్ల అభివృద్ధి వైపు చూసేలా అత్యుత్తమ ప్రమాణాలతో రహదారులను నిర్మించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. గతంలో ఎంపీగా తన గెలుపుకు ఇబ్రహీంపట్నం ప్రజల మద్దతే కీలకమని, తనకు ఇక్కడి ప్రజలతో ఉన్న ప్రత్యేక అనుబంధమే ఈ స్థాయిలో రోడ్ల నిర్మాణానికి కారణమని చెప్పారు. మరోసారి అవకాశం కల్పిస్తే సంపూర్ణ అభివృద్ధి సాధిస్తామని చెప్పారు.

**వారు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే... వేము భవిష్యత్ కు బాటలు వేస్తున్నాంః ఎమ్మెల్యే మల్ రెడ్డి...**
వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు, మంత్రి వెంకన్న సహకారంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం రూపురేఖలు పూర్తిగా మార్చివేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన మాట మేరకే... నేడు అభివృద్ధిని చేసి చూపిస్తున్నట్లు తెలిపారు. గత భారాస ప్రభుత్వం ఫార్మా ఏర్పాటుతో ఇక్కడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ప్రయత్నం చేస్తే, తామొచ్చాక భవిష్యత్ కు బాటలు వేసేలా ఫ్యూచర్ సిటీ, అంతర్జాతీయ సమీకృత మార్కెట్, ఆరుట్ల మోడల్ స్కూల్ లాంటి వాటితో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ప్రపంచపటంలో నిలుపుతున్నామ్నారు.

**వెంకటేశ్వర స్వామి అభిషేకానందాలయం వద్ద ప్రత్యేక పూజలు....**
మంత్రి రాకకు ముందు మల్ రెడ్డి రంగారెడ్డి స్వగ్రామంలో రూపుదిద్దుకుంటున్న శ్రీ వేంకటేశ్వరస్వామి అభిషేకానందాలయాన్ని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, శంకర్ నాయక్, తదితర నేతలు సందర్శించారు. రాజగోపురం లోపల చిత్రకంఠ స్తంభాల స్థాపనలో వారు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు

---

## ఎకో టౌన్ (డంపింగ్ యార్డ్) ప్రతిపాదనను రద్దు చేయాలి

**మండలి చైర్మన్ గుత్తాకు బండరావిరాల సర్పంచ్ విజయ్ కుమార్ బృందం వినతి!**

**నిర్భయవార్త ప్రతినిధి :అబ్దుల్లాపూర్మెట్:**



గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పణంగా పెడుతూ బండరావిరాల పరిసరాల్లో ఏర్పాటు చేయాలనుకుంటున్న ‘ఎకో టౌన్ (డంపింగ్ యార్డ్)’ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పిలాయిపల్లిలో జరిగిన ఒక బహిరంగ సభకు విచ్చేసిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిలను సర్పంచ్ విజయ్ కుమార్ నేతృత్వంలోని గ్రామస్థుల బృందం కలిసి నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను రద్దు చేయాలని కోరుతూ వారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఎకో టౌన్ పేరుతో ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే స్థానికంగా తీవ్ర పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చుట్టుపక్కల రైతుల వ్యవసాయాన్ని దెబ్బతీయడమే కాకుండా, గ్రామ భవిష్యత్తును, ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా నష్టపరుస్తుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆందోళనలు, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కందికంటి విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన మరియు వినతిపత్రం సమర్పించిన వారిలో సర్పంచ్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్థుల విజ్ఞప్తిపై స్పందించిన మండలి చైర్మన్, ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

## రెవెన్యూ, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**శాశ్వత పరిష్కారం..**
అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. హౌజింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి, నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల నిర్వహణ బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని, ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా, నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

## దేశంలో ‘ఈ-25 పెట్రోల్’ లాంచ్ వార్తలు..

(మొదటి పేజీ తరువాయి)

అంతకు మించి ఈ-25 పెట్రోల్‌ను ప్రవేశపెట్టే ప్రతిపాదన ప్రస్తుతం పరిశీలనలోనే లేదని సంబంధిత మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.కాగా, గత రెండు, మూడు రోజుల నుంచి జాతీయ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికల్లో, త్వరలోనే దేశంలో వాహనాల కోసం ఈ-25 పెట్రోల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నారని ప్రచారం ఊపందుకుంది. దీంతో ఇంధన ధరలు, వాహనాల ఇంజన్ సామర్థ్యంలో మార్పులు వస్తాయంటూ కథనాలు ప్రసారం అయ్యాయి. తాజాగా ఈ ప్రచారంపై పెట్రోలియం శాఖ స్పందిస్తూ.. ప్రజలు, వాహనదారులు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని, ఒకవేళ ఏదైనా ఉంటే సంబంధిత మంత్రిత్వ శాఖనే ప్రకటన విడుదల చేస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

## అమరావతి రైతులకు బంపరాఫర్

**నిర్భయవార్త ప్రతినిధి : అమరావతి:**
సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ సమావేశం జరిగింది. ఈ భేటీలో ప్రధానంగా రాజధాని పరిధిలోని రైతులు, భూమి కోల్పోయిన వారి సంక్షేమమే ధ్యేయంగా కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇచ్చిన రైతులకు కౌలు పెంచడంతో పాటు, కొత్తగా ల్యాండ్ పూలింగ్‌లో పాల్గొనే రైతులకు రుణమాఫీ ప్రకటిస్తూ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన అన్నదాలతకు ఇచ్చే వార్షిక కౌలు మొత్తాన్ని ప్రభుత్వం భారీగా పెంచింది. జూన్ 2024 నుంచి భూములు ఇచ్చే వారికి ఏడాదికి రూ. 40 వేల చొప్పున కౌలు ఇచ్చేందుకు సీఆర్డీఏ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ పెంపుదల వారు భూములు ఇచ్చినప్పటి నుంచి పదేళ్ల పాటు వర్తించనుంది.అయితే, జరీబు భూములకు ఇచ్చే కౌలును రూ. 5 వేలు, మెట్ట భూములకు ఇచ్చే కౌలును రూ. 3 వేల చొప్పున పెంచేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఇక గ్రామ కంఠాల్లో భూములు కోల్పోతున్న వారికి కూడా ఊరటనిస్తూ.. వారికి ఏటా రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా రాజధాని పరిధిలో కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం రుణమాఫీ అస్త్రాన్ని తెరపైకి తెచ్చింది. కొత్తగా పూలింగ్‌లో భాగస్వాములయ్యే రైతులకు రుణమాఫీ చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## టీఆర్ఎస్ పేరు వివాదం..

(మొదటి పేజీ తరువాయి)

**కోర్టులో ఇరుపక్షాల వాదనలు:**
విచారణ సందర్భంగా ‘తెలంగాణ రక్షణ సమితి’ పేరు రిజిస్ట్రేషన్‌పై తీవ్రమైన అభ్యంతరాలు వచ్చాయని కోర్టు ప్రస్తావించింది. అయితే, కవిత తరపు న్యాయవాదులు ఈ వాదనను తోసిపుచ్చారు. పార్టీ పేరుపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, ఈ విషయంలో వ్యక్తిగతంగా వాదనలు వినిపించేందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వలేదని కవిత న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కాగా, తాము అన్ని నిబంధనల ప్రకారమే నడుచుకున్నామని ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు.

**ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వండి:**
వాదనలు విన్న అనంతరం ఢిల్లీ హైకోర్టు కీలక సూచన చేసింది. ‘తెలంగాణ రక్షణ సమితి’ అనేది పాత టీఆర్ఎస్ పార్టీ పేరును పోలి ఒకేలా కనిపిస్తోందని అభిప్రాయపడింది. అలాగే ‘తెలంగాణ రక్షణ సేన’ అనే పేరు కూడా పాత టీఆర్ఎస్ అర్థం వచ్చేలాగే ఉందని పేర్కొంది. అందువల్ల ఈసీ లేవనెత్తిన అభ్యంతరాలకు గడువులోగా సమాధానం ఇవ్వడంతో పాటు, పార్టీ పేరు కోసం కొన్ని ప్రత్యామ్నాయ పేర్లను ఎన్నికల సంఘానికి సమర్పించాలని కవితకు ఢిల్లీ హైకోర్టు సూచించింది.

## ‘నా శాఖతో అతనికేం సంబంధం?’..

(మొదటి పేజీ తరువాయి)

**ఈ మధ్య సయోధ్య ఇంతలోనే..**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా రాజకీయ వ్యవహారం సాగుతోంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో గతంలో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఆ క్రమంలో మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళిపై కడియం శ్రీహరి తో పాటు ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు ఏకంగా రాష్ట్ర నేతలకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో కొండామురళి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరు కూడా అయ్యారు. ఈ రెండు వర్గాల మధ్య వివాదం ముదిరి పార్టీకి డ్యామేజ్ చేయబోతోందని భావించిన పార్టీ పెద్దల గాంధీ భవన్ వేదికగా జోక్యం చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఇప్పుడిప్పుడే వీరి మధ్య సయోధ్య కుదిరి వివాదం సద్దుమణిగిందని అంతా భావిస్తున్న తరుణంలో తాజాగా కడియం శ్రీహరిపై మంత్రి కొండా సురేఖ ఏఐసీసీకి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. తాజా పరిణామాలు తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి పరిస్థితులకు దారి తీయబోతున్నాయో చూడాలి మరి!.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

సోలార్ విద్యుత్ కేంద్రాలు, శిల్పారామంలో నైట్ బజార్‌ను మహిళలకే ఇచ్చామని తెలిపారు. 2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముందుగా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడితే.. ఆరోగ్యవంతమైన తెలంగాణ అవతరిస్తుందని అన్నారు. సంపాదించింది మొత్తం విద్య, వైద్యానికి ఖర్చు అవుతోందని.. పిల్లలతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బందికి కూడా బ్రేక్‌ఫాస్ట్, లంచ్ అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఏడాదికి రూ. 27 వేల కోట్లు పిల్లల చదువులపైనే ఖర్చు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మెనూ ప్రకారం ఆహారం అందించాలి.

దుమ్ముగూడెశీ జూలై 7 నిర్భయ వార్త ప్రతినిధి. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థినిలకు చక్కటి విద్యాబోధనతో పాటు మెనూ ప్రకారం సమయానుకూలంగా ఆహారము వేడిగా ఉన్నప్పుడే అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు మంగళవారం దుమ్ముగూడెం మండలంలోని గౌరారం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, డార్మెటరీ రూమ్, స్టోర్ రూమ్ వంటశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక స్థాయి విద్యార్థినిలతో గణితం మరియు ఆంగ్లంలో విద్యార్థినిలు కనపరుస్తున్న ప్రతిభను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను ప్రశంసిస్తూ ఈ పాఠశాలలో అద్భుతమైన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. పదవ తరగతి విద్యార్థినిలను పరీక్షల చివరి 100 రోజుల వరకు వేచి ఉండకుండా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే క్రమబద్ధమైన కార్యచరణ ప్రణాళికతో ప్రతిరోజు చదివేలా చూడాలని, విద్యార్థినిలు కూడా నిరంతర సాధన క్రమశిక్షణ మరియు లక్ష్యంతో కూడిన ప్రణాళికే అత్యుత్తమ ఫలితాలకు మార్గం సుమగమవుతుందని విద్యార్థినిలకు సూచించారు. అలాగే ఉన్నత విద్యా భవిష్యత్తు ఉద్యోగాల అవకాశాల కోసం ఇప్పటినుంచే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు అనంతరం ప్రకృతిని సంరక్షించే బాధ్యత ప్రతి విద్యార్థినిలో పెంపొందించాలని లక్ష్యంతో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో సపోటా మొక్కను నాటి, విద్యార్థినిలకు సిద్ధం చేస్తున్న పోషకాహార భోజనాన్ని స్వయంగా పరిశీలించి పరిశుభ్రత నిర్వహణ మరియు ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇదే ప్రమాణాలను నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే సమీపంలోని జిపిఎస్ పాఠశాల విద్యార్థులను ఏ జి హెచ్ ఎస్ గౌరారం పాఠశాలల్లో విలీనం చేస్తే మరింత మెరుగైన విద్యా అవకాశాలు పిల్లలకు కల్పించవచ్చని అన్నారు. అనంతరం గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి మరియు సంక్షేమం కోసం ఆయన అందిస్తున్న మార్గదర్శకత్వాన్ని అభినందిస్తూ పాఠశాల సిబ్బంది విద్యార్థినిలు పిఓకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మోతిర్, వీరస్వామి విద్యార్థినిలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# మహిళల స్వయం ఉపాధికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుంది

**శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ**

కాప్రా, జూలై 7 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవన్ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్ నాయక్‌నగర్ బంజారా కాలనీలో మహిళల కోసం స్వయం ఉపాధి శిక్షణ శిబిరం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు కాప్రా డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కాప్రా డివిజన్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు తన్నీరు శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు స్వయం ఉపాధి మరియు పారిశ్రామిక రంగాల్లో ముందుకు వచ్చి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో శిక్షణ పొందిన మహిళలకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కాప్రా డివిజన్ మాజీ అధ్యక్షుడు కొబ్బనూరి నాగశేషు, జిల్లా ఏఎంసి మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, మనోజ్ కుమార్, మానస్, శివ, అభివర్మ, మహిళా నాయకులు సుహిత, పద్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.





# సింగరేణి అధికారుల న్యాయపోరాటానికి ఎస్సీ జేఏసీ సంపూర్ణ మద్దతు!

**రుద్రంపూర్‌లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు..**
**శిబిరాన్ని సందర్శించిన జేఏసీ అధినేత బొమ్మెర శ్రీనివాస్**

కొత్తగూడెం, జులై 8 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)సింగరేణి మైనింగ్ అధికారులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (జేఏసీ) సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. అధికారుల పోరాటం ఉధృతమవుతున్న నేపథ్యంలో, వారి డిమాండ్లకు జేఏసీ మద్దతు తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది.రుద్రంపూర్ పరిధిలోని సింగరేణి జీఎం కార్యాలయం ప్రాంగణంలో, వర్క్ షాప్ ఏజీఎం కలవల చంద్రశేఖర రావు నేతృత్వంలో మంగళవారం మైనింగ్ అధికారుల రిలే నిరాహార దీక్షలు శాంతియుతంగా కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ సందర్శించి, దీక్షలో కూర్చున్న అధికారులకు శాలువాలు కప్పి తమ పూర్తి మద్దతును తెలియజేశారు.



**సమన్వయమే సమస్యలకు పరిష్కారం,**

సింగరేణి సంస్థ పురోగతిలో మైనింగ్ అధికారుల పాత్ర కీలకమైనది. కార్మికులు, యాజమాన్యం మరియు ప్రభుత్వం ఒకరితో ఒకరు సమన్వయంతో వ్యవహరించి, పట్టింపులకు పోకుండా మైనింగ్ అధికారుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి.

కార్మిక హక్కుల ప్రదాత బాబాసాహెబ్ అంబేద్కర్

ఈ సందర్భంగా బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1947లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సగర్వ కాలంలోనే.. కార్మికుల కనీస వేతనం, బోనస్, మరియు జీతంతో కూడిన సెలవుల వంటి చారిత్రాత్మక హక్కులను ప్రభుత్వంతో చర్చించి సాధించి పెట్టారని గుర్తుచేశారు. దేశానికి 'పేదరికమే' పరమ శత్రువని, సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న ధనవంతులు పేదలను ఆదరించి, వారికి తోడ్పాటు అందించినప్పుడే బాబాసాహెబ్ ఆశయాలు నెరవేరుతాయని ఆయన స్పష్టం చేశారు.ఈ సంఘీభావ కార్యాక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎనగంటి కృపాకర్, ముఖ్య నాయకులు బొమ్మెర పవన్ కళ్యాణ్, ఎనగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని అధికారుల పోరాట పటిమను కొనియాడారు.

# కారేపల్లి లో సాంప్రదాయంగా సీత్ల భవాని పండుగ

**పాల్గొన్న గ్రామ సర్పంచ్ మేదరి టోనీ.**

సింగరేణి జూలై 07 నిర్భయవార్త రిపోర్టర్.సింగరేణి మండల కేంద్రంలో బుధవారం గిరిజనులు సీత్ల భవాని పండుగ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో లంబాడి (బంజారా) గిరిజనులు ఎంతో భక్తిశ్రద్ధలతో పకృతిని ఆరాధిస్తూ జరుపుకునే సాంప్రదాయ పండుగ తొలకరి వర్షాలు కురిసిన తర్వాత సాంప్రదాయంగా ఈ పండుగను నిర్వహించారు. దైవ ఆరాధన ఏడుగురు కుల దేవతల్లో చిన్నదైనా సీత్ల ని ఈ పండుగలు పూజిస్తారు. గిరిజన నాయకులు పశు సంపద అభివృద్ధి చెందాలని, ప్రజలందరికీ ఆరోగ్యం కలగాలని, తండ గ్రామ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పకృతిని తలుచుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కారేపల్లి గ్రామ సర్పంచ్ టోనీ ముఖ్యఅతిథిగా పాల్గొని దేవతలను పూజించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సోదరి సోదరీమణులందరికీ శీతల పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ పండుగలో పాల్గొనడం ఆనందంగా ఉందంట నాకు తెలిపారు.




# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం జులై 7 నిర్భయవార్త రిపోర్టర్. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధిర పట్టణంతో పాటు ఎర్రుపాలెం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న విధానం, నింపిన ఫారాలను స్వీకరిస్తున్న తీరు, ఓటర్ల వివరాలను నమోదు చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు కాలనీలు, నివాస ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్ ఓటర్లతో నేరుగా మాట్లాడారు. ఎన్యూమరేషన్ ఫారాలపై వారికి ఉన్న సందేహాలు, అపోహలను తెలుసుకుని వాటిని నివృత్తి చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఉద్దేశ్యం, ఫారాల ప్రాముఖ్యత, సకాలంలో వివరాలు అందజేయాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ప్రతి బీఎల్ఓ తప్పనిసరిగా బీఎల్ఓ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే వివరాలను నమోదు చేయాలని, సమాచార నమోదులో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితానే మూలాధారం అని, అందులో ప్రతి ఓటరు వివరాలు తప్పుల్లేకుండా నమోదు కావడం అత్యంత కీలకమని ఆయన అన్నారు. ప్రతి నమోదు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, డేటా నమోదు, ధృవీకరణ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బీఎల్ఓ రోజువారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని తమ పరిధిలోని ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందించి, పూర్తి చేసిన ఫారాలను నిర్దేశిత గడువులోగా తిరిగి స్వీకరించి డిజిటైజేషన్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరూ మిగిలిపోకుండా ప్రతి కుటుంబాన్ని చేరుకోవాలని, సర్వే ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని సూచించారు.ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ సమయంలోనే ఓటర్లకు ఎదురయ్యే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని, తప్పుడు ప్రచారం లేదా అపోహలకు ఆస్కారం లేకుండా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్లలో విశ్వాసం పెంపొందించడం, ఎన్నికల ప్రక్రియపై స్పష్టత కల్పించడం బీఎల్ఓల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఓటరు తన వ్యక్తిగత వివరాలను సక్రమంగా నమోదు చేసి, పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్ఓలకు అందజేసి ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పారదర్శకమైన, విశ్వసనీయమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకుగా భాగస్వాములు కావాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సహకరించాలని ఆయన కోరారు. అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే నాణ్యమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, మధిర మండల తహసీల్దార్ రాంబాబు, ఎర్రుపాలెం మండల తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, మధిర మున్సిపల్ కమిషనర్, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య -- ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్







కొత్తగూడెం జులై 8 ( నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి ) జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం సుజాతనగర్ మండలంలో పర్యటించి ప్రభుత్వ పాఠశాల పనితీరుతో పాటు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించారు.ముందుగా సుజాతనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, విద్యార్థుల హాజరు, బోధన తీరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, నాణ్యమైన, పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకుని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందేలా ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.అనంతరం సుజాతనగర్ మండలం రాఘవాపురం గ్రామంలోని పలు వార్డుల్లో ఇంటింటా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు)తో మాట్లాడారు.గ్రామంలో ఇప్పటివరకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు, విధులు నిర్వహిస్తున్న బీఎల్వోల సంఖ్య, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై కలెక్టర్ ఆరా తీశారు. అధికారులు స్పందిస్తూ గ్రామంలో ఇప్పటివరకు 1,400 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు వివరించారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీతో పాటు ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ నిర్ణీత గడువులోగా ఫారాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిని బీఎల్వోలు తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, అందులోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు . అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారం చూపాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కీలక కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అధికారులు, బీఎల్వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించి ఓటర్ల జాబితా సవరణను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల ఐక్యతే మన బలం మన లక్ష్యం సమాన సమాజం. మండల ఇంచార్జ్ కనకం జనార్ధన్

**కారేపల్లి లో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవ వేడుక.**

**పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్.**

సింగరేణి జులై 7 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ



సందర్భంగా మండల అధ్యక్షులు తిప్పారపు నాగేంద్రబాబు, గ్రామ శాఖ అధ్యక్షులు ఆదేర్ల రామారావు ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఇంచార్జ్ కనకం జనార్ధన్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ స్థాపించిన ఉద్యమం గురించి వారు సాధించిన ఉద్యమ ఫలాల గురించి వర్గీకరణ యొక్క ఫలాలు జాతి బిడ్డలు పొందాలంటే ప్రతి ఒక్క కుటుంబంలోని పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి అప్పుడు మాత్రమే వర్గీకరణ యొక్క కృష్ణ మాదిగ యొక్క కష్టానికి ఫలితాన్ని ప్రభుత్వ ఉద్యోగాల రూపేనా పొంది కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని వివరించడం జరిగింది. అలాగే పుట్టినరోజు జరుపుకుంటున్నటువంటి ఉద్యమ నాయకుడు మాదిగల ఆరాధ్య దైవం చిన్నపిల్లల గుండె చప్పుడు ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీల హక్కులకై పోరాడే అభినవ్ మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. మందకృష్ణ మాదిగ ఉద్యమం కోసం ఎప్పుడు ఏ రకమైన పిలుపునిచ్చిన అందరూ కలిసి విజయవంతం చేయడం కోసం కలిసి పనిచేస్తామని అన్నారు.



ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి కనకం జనార్ధన్, మండల అధ్యక్షుడు తిప్పారపు నాగేంద్రబాబు, ఎంఎస్పి మండల అధ్యక్షులు కాప ప్రసాద్,గ్రామ శాఖ అధ్యక్షుడు ఆదేర్ల రామారావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆదేర్ల అంజయ్య, ఆదేర్ల రాములు, ఆదేర్ల శంకర్, ఆదేర్ల వీరస్వామి,మాజీ మండల అధ్యక్షులు కేశగాని బాలకృష్ణ, గ్రామ కార్యదర్శి కాంపాటి రవి,రాయల నరేంద్ర, వలియ దాసరి సంఘ నాయకులు సమ్మయ్య, ఆదేర్ల వెంకటయ్య, జ్ఞానయ్య, నాగార్జున, వేణు,గౌతమ్, శివాజీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పై కార్యాచరణ ప్రకటించాలి .


**సాగుదారులందరికీ పోడు హక్కుకల్పించాలి - సీపీఐ(ఎం)**

సింగరేణి జులై 7 నిర్భయవార్త రిపోర్టర్. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు సభలతో సరిపుచ్చుతున్నారని, సమస్యలు గాలికొదిలేస్తున్నారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు మంగళవారం మండల కార్యదర్శి కే నరేంద్ర అధ్యక్షతన ఉసిరికాయలపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 న సీఎం రేవంత్



రెడ్డి ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం లో రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారని, గతంలో మూడు పర్యాలు ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చి ఏమి చేశారని ప్రశ్నించారు. జిల్లాలో సీతరామ ప్రాజెక్ట్ నీటిని పారించుటకు నిధులను వరదల విడుదల చేస్తానని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్న పూర్తి నిధులు విడుదల చెయ్యలేదన్నారు. రైతు రుణమాఫీ, భరోసా నిధులు సక్రమంగా ఇవ్వకుండా ఎగ్గొట్టటమే కాక కనీసం రైతులకు యూరియా సరఫరా చేయలేని స్థితిలో సీఎం ఉన్నారన్నారు. ఎలాంటి సాగునీరు సౌకర్యం లేని ఎడారి ప్రాంతాలుగా సింగరేణి, కామేపల్లి రఘునాథపాలెం మండలాలు ఉన్నాయని సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందించాలంటే జూలూరుపాడు వర్ద గుట్టపై టెన్నల్ తవ్వకం ప్రారంభించి మండలాల కు సాగు నీరు అందించే విషయం మరిచారన్నారు. జిల్లా లో ఉన్న ముగ్గురు మంత్రులు మూడు కాలువలు పంచుకొని వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాంట్రాక్టర్లను టెండర్లు పిలిచుకొని ప్రాంతాల స్వార్థానికి పరిమితమై నారని విమర్శించారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా సాగు నీరుని అందించాలని చిత్తశుద్ధి మంత్రులకు లేదన్నారు. ఈనెల 9న చింతకాని జగన్నాథపురంలో జరిగే ముఖ్యమంత్రి సభలో సీతారామ నిధులు విడుదల చేయడంతో పాటు చిత్తశుద్ధితో ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసేలా కార్యచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అత్యధిక మంది పోడు సాగు పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని గతంలో సిపిఐ(ఎం) చేసిన ఆందోళన పోరాట ఫలితంగా గత ప్రభుత్వం హక్కు పత్రాలు ఇచ్చుటకు అంగీకరించి సర్వే నిర్వహించారన్నారు. గిరిజనులకు మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చి గిరిజనేతర సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వడం మర్చిపోయారన్నారు. సర్వే పూర్తియి హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తున్న గిరిజనేతర పోడు రైతులకు హక్కు పత్రాలు ఎప్పుడు ఇస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కోల్ మైన్స్ మాదారం స్టీల్ ప్లాంట్ డోలమైట్ మైనింగ్ సంస్థల నుండి అభివృద్ధి నిధులను తీసుకువచ్చే అవకాశాన్ని ప్రస్తుతం జిల్లా మంత్రులు నియోజకవర్గ శాసనసభ్యులు పట్టించుకోవడంలేదని ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఆ సంస్థల ద్వారా అభివృద్ధి నిధులను మంజూరు చేయించి సింగరేణి మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఇందిరమ్మ ఇండ్లు మొదటి ద ఫాలో అరకొరగా అందినాయని, రెండో దఫాలో లబ్ధిదారులందరికి ఒకేసారి ఇండ్లు మంజూరు చేయాలన్నారు.

# రాజేందర్ నగర్ లోని ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి .




రంగారెడ్డి జులై 7 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేందర్ నగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి. ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు.కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ ఆర్డిఓ, తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు

# 106 కేసులున్న దొంగ అరెస్ట్





జులై 7 (నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి సిసిఎస్ గుమ్మడిదల పోలీసుల సంయుక్త ఆపరేషన్ లో 106 కేసుల్లో నిందితుడిగా ఉన్న దొంగ కోటపల్లి చంద్రి అలియాస్ శేఖర్ ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 22.5 తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు 25 వేల నగదు తీసుకొని మంగళవారం నాడు రిమాండ్ కు తరలించారు. కేసులు ఛేదించడంలో ప్రతిభను చూపించిన పోలీస్ సిబ్బందిని సంగారెడ్డి జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ పరతోష్ పంకజ్ అభినందించారు! గతంలో బాలికపై అత్యాచారం చేసిన కేసులో 14 నెలలు జైలు శిక్ష అనుభవించినట్టు పోలీసులు తెలిపారు.

# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి.





రంగారెడ్డి జులై 7 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ూజూవఎఖుశ్రీ ×త్వఅంఱజవ =వజఅంఱశీఅ-ూ×=) కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని ఆర్డీవోలు, జోనల్ మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీఓలు, ఎంపీఓలు, సీడీపీఓలు, మెప్మా అధికారులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 92 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, మిగిలిన ఫారాల పంపిణీని ఈరోజు సాయంత్రంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



బూత్ లెవల్ అధికారులు (దీూూలు) ప్రజల నుంచి నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సేకరించి, వెంటనే సంబంధిత యాప్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అనర్హులను ఓటరు జాబితా నుంచి తొలగించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన మేర ప్రత్యామ్నాయ సిబ్బందిని గుర్తించాలని, ఫారాల నింపడం, పరిశీలించడం, డిజిటలైజేషన్ పనుల కోసం ఉపాధ్యాయులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అదనపు సిబ్బంది, వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం రెండు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ఎన్నికల నమోదు అధికారులు (జు=ూం), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ూజు=ూం) ప్రతి పోలింగ్ కేంద్రంలో బలమైన బృందాలను ఏర్పాటు చేసి ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని తెలిపారు. ఈరోజు నుంచే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, రేపటి నుంచి గ్రామాలు, మున్సిపల్ వార్డుల స్థాయిలో ూ×= ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించాలని సూచించారు. ఫారాల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని, బీఎల్ఓలు ఫారాలను సక్రమంగా స్వీకరించి ప్రత్యేకంగా నియమించిన సిబ్బందితో పరిశీలింపజేసి, అనంతరం సంబంధిత యాప్‌లో డిజిటలైజ్ చేసి భద్రపరచాలని ఆదేశించారు. ప్రతి దశకు సంబంధించిన మాన్యువల్ రికార్డులను కూడా తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు కనీసం 20 శాతం పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని, రాబోయే ఐదు రోజుల్లో 100 శాతం లేదా కనీసం 90 శాతం ప్రక్రియ పూర్తి చేసే లక్ష్యంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. మండల స్థాయి సీనియర్ అధికారులు పోలింగ్ కేంద్రాలను వర్గీకరించి, అవసరాన్ని బట్టి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను రేపటి నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ మొత్తం ప్రక్రియను జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబితా సిద్ధమైన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను సేకరించి సంబంధిత నివేదికను జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలోని ప్రతి ఆర్డీవో, జోనల్ మున్సిపల్ కమిషనర్లతో విడివిడిగా మాట్లాడి, వారి కార్యాచరణ ప్రణాళికలను సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

# స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుంటే ఖమ్మంలో సీఎం మీటింగ్ ను అడ్డుకుంటాం.

**పి.డి.ఎస్.యు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జీ. మస్తాన్.**

ఖమ్మం జూలై 07 నిర్భయవార్త రిపోర్టర్.ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఖమ్మం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ అనుబంధం పీజీ కళాశాల , బీపిడి కళాశాల ఎదుట నిరసన తెలిపి అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది...ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జి.మస్తాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో




ఉన్న ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు విద్యారంగానికి అనేక రకాల హామీలు ఇచ్చి అధికారాలు వచ్చిన తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. ముఖ్యంగా మేము అధికారంలోకి వస్తే ఇంకా మెరుగైన రీతిలో ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తాం, విద్యా రంగానికి బడ్జెట్లో 15% నిధులు కేటాయిస్తాం, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తాం, టిఆర్ఎస్ ప్రభుత్వం మూసివేసిన దాదాపు 6000 పాఠశాలలను తిరిగి మెరుగైన సదుపాయాలతో పున ప్రారంభం చేస్తాం, ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు చేసి ప్రైవేటు ఫీజులు నిర్ణయిస్తాం ఇలా అనేక హామీల వర్షం కురిపించి అధికారాన్ని చేపట్టిన రేవంత్ సర్కార్ నేడు విద్యాశాఖ మంత్రి నియమించకుండా విద్యారంగ సమస్యల పరిష్కరించకుండా పేరుతో విగ్రహాల పేరుతో ప్రజాధనాన్ని దుబారాగా ఖర్చు చేస్తున్నాడు. నేడు కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో లక్షల రూపాయలు తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్న విద్యాధికారులు పట్టించుకోవడం లేదు, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఒక బ్రాంచ్ పర్మిషన్ తో 2, 3 బ్రాంచులు నిర్వహిస్తున్న వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు, విద్యా సంవత్సరం ప్రారంభం రాకముందే ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై బుక్స్ తో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, ఖమ్మం జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ నిర్మించాలని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఫ్లీజ్ రియంబర్స్మెంట్ పథకంపై ఆధారపడి చదువుతుంటే వారికి రావలసిన బకాయిలు దాదాపు 11 వేల కోట్ల రూపాయలు విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయాలను తక్షణమే చెల్లించాలి లేని పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బకాయిలు విడుదల చేయకుండా మీరు ఖమ్మం మీటింగ్ కు వస్తే అడ్డుకొని తీరుతామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షులు గాంధీ, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ ,నరసింహ, శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల మహాసభను విజయవంతం చేయాలి

జులై 7 (నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి ఈనెల 9న సంగారెడ్డిలో నిర్వహించుచున్న టీయూడబ్ల్యూజే- ఐజేయు జర్నలిస్టుల మహాసభను విజయవంతం చేయాలని పటాన్చెరువు నియోజకవర్గం ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్షుడు రూమానుల మంగళవారం నాడు అనిల్ కుమార్ కోరారు! మహాసభకు రాష్ట్ర అధ్యక్షుడు విరాహిత్ అలీతో పాటు రాష్ట్ర నాయకులు ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



## ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్‌ను కలిసిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర.



విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి ;:.టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్‌ను విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేఎస్ జవహర్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ఈ సమావేశంలో ఎస్సీ కమిషన్ సభ్యులు డా. శ్రీపతి బాబు, డా. గౌతమ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం.

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.



కోవూరు, నిర్భయవార్త ప్రతినిధి ;:.కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు.

## జూలై 8న టీడీపీ మండల స్థాయి సమావేశాలు.



కోవూరు, నిర్భయవార్త ప్రతినిధి :టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు క్యాడర్ క్యాలెండర్‌లో భాగంగా జూలై 8 (రెండో బుధవారం) మండల స్థాయి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కార్యాలయం సూచించింది. మండల, టౌన్, డివిజన్ అధ్యక్షులు తమ పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేసి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, క్లస్టర్, యూనిట్, కో–కన్వీనర్లు, రాష్ట్ర డైరెక్టర్లు, డబ్ల్యూయూఏ ఛైర్మన్లు, ఆలయ కమిటీ ఛైర్మన్లు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు, పార్టీ వివిధ స్థాయి నాయకులు తప్పనిసరిగా హాజరయ్యేలా సమన్వయం చేయాలని కార్యాలయం కోరింది.

## అధికారంలో అభివృద్ధి..ఇప్పుడు అవినీతి.

### కాకాణి విమర్శలు.

నరుకూరు, నిర్భయవార్త ప్రతినిధి ;:.ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి తోటపల్లిగూడూరు మండలం నరుకూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుతం కూటమి పాలనలో అభివృద్ధి శూన్యంగా మారి అవినీతి పెరిగిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, కొత్త పెన్షన్లు, గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని, అక్రమ ఓట్ల చేర్పు, పార్టీ ఓట్ల తొలగింపు ప్రయత్నాలను సమిష్టిగా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల వివాహం చేసుకున్న పార్టీ నాయకుడు పవన్ సోదరి నందిని--శ్రీకాంత్ దంపతులను ఆశీర్వదించారు. అవసరమైతే దీనిని ఇంకా చిన్నదిగా 2 పేరాగ్రాఫ్‌ల బ్రేకింగ్ న్యూస్ రూపంలో కూడా తయారు చేస్తాను.



## చేతి కళను మాత్రమే కాదు. కళాకారుడి జీవితాన్నీ స్పృశించిన పవన్ కళ్యాణ్

### రెండు గంటల పర్యటన. వేలాది హస్తకళాకారుల్లో కొత్త భరోసా.

### కళావేదికలో మానవీయ నాయకత్వం...

### హస్తకళాకారులతో మమేకమైన ఉప ముఖ్యమంత్రి.



అమరావతి, నిర్భయవార్త ప్రతినిధి ;:.ఒక్కో చేతిలో ఒక కళ... ఆ కళ వెనుక ఒక కుటుంబం... ఆ కుటుంబం వెనుక ఎన్నో ఆశలు, మరెన్నో ఆవేదనలు. చెక్కకు ప్రాణం పోసే వారు... మట్టికి రూపం ఇచ్చే వారు... లోహానికి అందాన్ని అద్దే వారు... రంగుల్లో సంస్కృతిని నిలబెట్టే వారు... మగ్గం శబ్దంలో జీవన సంగీతాన్ని వెతికే వారు... వీరంతా కేవలం హస్తకళాకారులు కాదు... మన సంస్కృతికి ప్రాణం పోసే సజీవ శిల్పులు. అలాంటి కళాకారుల మధ్యకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెళ్లినప్పుడు, అది ఒక ప్రభుత్వ కార్యక్రమంగా ముగిసిపోలేదు. కళను సృష్టించే చేతులను, ఆ చేతుల వెనుక ఉన్న జీవితాలను అర్థం చేసుకునే ఒక ఆత్మీయ ప్రయాణంగా నిలిచింది. విజయవాడ అంబేద్కర్ కళావేదికలో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం--2026లో అడుగుపెట్టిన తొలి క్షణం నుంచి చివరి వరకు ఆయన గడిపిన క్షణాలు ఎంతో విలువైనవిగా మారాయి. పవన్ ప్రతి స్టాల్‌ను సందర్శించారు. కళాఖండాలను చూసి ముందుకు వెళ్లిపోలేదు. వాటిని రూపొందించిన కళాకారులను పలకరించారు. వారి జీవన విధానం గురించి తెలుసుకున్నారు. ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కళాఖండం వెనుక ఎంత శ్రమ దాగి ఉందో, ఎంత సమయం పడుతుందో, ఎంత ఆదాయం వస్తుందో ఆసక్తిగా తెలుసుకున్నారు. "మీ పిల్లలు ఏమి చదువుతున్నారు...?", "వారికి చదువులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయి...?", "ఇంట్లో పెద్దల ఆరోగ్యం ఎలా ఉంది...?", "ప్రభుత్వం మీ కోసం ఇంకా ఏమి చేయాలి...?" అంటూ ఆయన అడిగిన ప్రతి ప్రశ్నలో ఒక ప్రజాప్రతినిధి కంటే ఒక కుటుంబ సభ్యుడి ఆప్యాయత కనిపించింది. కళాకారులు చెప్పిన ప్రతి మాటను ఓపికగా విన్నారు. సమస్యలను నమోదు చేయించారు. వెంటనే సంబంధిత అధికారులను పిలిచి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వారి కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. చేతివృత్తిదారుల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని పేర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రోజంతా చేతులతో శ్రమించే కళాకారుల ఆరోగ్యం బాగుంటేనే వారి కళ కూడా చిరకాలం నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రదర్శనలో ఉన్న ప్రతి ఉత్పత్తిని ఎంతో నిశితంగా పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి, లేపాక్షి ఉత్పత్తుల ప్యాకేజింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడాలంటే నాణ్యమైన ఉత్పత్తితో పాటు ఆధునిక ప్యాకేజింగ్, ఆకర్షణీయమైన బ్రాండింగ్, సమర్థవంతమైన మార్కెటింగ్ కూడా అవసరమని సూచించారు. సంప్రదాయ కళలకు ఆధునిక వ్యాపార దృక్పథాన్ని జోడిస్తే హస్తకళలకు కొత్త మార్కెట్లు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో అత్యంత విశేషమైన అంశం... ఉప ముఖ్యమంత్రి ప్రదర్శనలో దాదాపు మూడున్నర గంటలపాటు గడపడం. ఇది ఒక సాధారణ అధికారిక సందర్శన కాదు. ఒక్కో స్టాల్ వద్ద ఆగి, ఒక్కో కళాకారుడితో మాట్లాడి, ప్రతి అంశాన్ని స్వయంగా పరిశీలించడానికి ఆయన కేటాయించిన సమయం హస్తకళల పట్ల ఆయనకున్న గౌరవాన్ని ప్రతిబింబించింది. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాల్లో కొద్దిసేపు పాల్గొని వెళ్లిపోవడం ఆనవాయితీ. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం కళాకారుల మధ్యే ఉండి, వారితో మమేకమై, వారి జీవితాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కూడా ఆయన వెళ్లిపోలేదు. హస్తకళాకారుల అభ్యర్థన మేరకు వారితో ప్రత్యేకంగా గ్రూప్ ఫోటోలు దిగారు. చిన్నారులతో ముచ్చటించారు. మహిళా కళాకారులను ప్రత్యేకం గా అభినందించారు. వృద్ధులను పలకరించి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. తమతో కలిసి ఉప ముఖ్యమంత్రి ఫోటో దిగడం కళాకారులకు కేవలం ఒక జ్ఞాపకం మాత్రమే కాదు... తమ కళను ప్రభుత్వం గుర్తించిందనే గర్వకారణంగా మారింది. కళావేదికలో కేవలం హస్తకళల ప్రదర్శన మాత్రమే జరగలేదు. కళాకారుడి చెమటకు గౌరవం దక్కింది. అతని కుటుంబానికి ఒక భరోసా లభించింది. కళను కాపాడాలంటే కళాకారుడిని కాపాడాలనే సందేశం ప్రభుత్వ అత్యున్నత స్థాయి నుంచి వినిపించింది. సమస్యలను వినే నాయకత్వం, పరిష్కారాలను అన్వేషించే పాలన, శ్రమకు విలువ ఇచ్చే మానవీయ దృక్పథం ఎలా ఉంటుందో ఆ రోజు అందరూ ప్రత్యక్షంగా చూశారు. రెండు గంటల ఆ పర్యటన ముగిసే సమయానికి అక్కడి నుంచి వెళ్లింది ఒక ఉప ముఖ్యమంత్రి మాత్రమే కాదు... వేలాది హస్తకళాకారుల హృదయాల్లో కొత్త ఆశను, కొత్త విశ్వాసాన్ని నాటిన ఒక భరోసా. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత, ప్రభుత్వ సలహాదారు సుచిత్ర ఎల్లా, చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా, లేపాక్షి ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, లేపాక్షి , ఎంఎస్ఎంఈ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చలపతిరావు, సలహాదారు మల్లికార్జున రావు, ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్‌తో వ్యాధులు..!

### పుణే శాస్త్రవేత్తలు అధ్యాయణం.

అమరావతి, నిర్భయవార్త ప్రతినిధి ;:.దేశంలో డెంగ్యూ మహమ్మారి వ్యాప్తికి కేవలం భారీ వర్షాలే కారణమని భావిస్తున్న సమయంలో, ఎల్‌నినో ప్రభావం కూడా డెంగ్యూ వ్యాప్తిని పెంచుతుందని పుణేలోని పరిశోధకులు సంచలన విషయాన్ని వెల్లడించారు. గత 12 ఏళ్ల వాతావరణ, వ్యాధుల గణాంకాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు, ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గినా దోమల గుడ్లు, లార్వాలు ఎక్కువకాలం జీవించి, పరిస్థితులు అనుకూలంగా మారగానే వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరించారు. పరిశోధనలో భాగంగా ఉష్ణోగ్రతలు, తేమ, వర్షపాతం, డెంగ్యూ కేసుల మధ్య ఉన్న సంబంధాన్ని లోతుగా విశ్లేషించిన శాస్త్రవేత్తలు, వాతావరణ మార్పులను ముందుగానే గుర్తించి డెంగ్యూ ప్రమాదాన్ని అంచనా వేసే ప్రత్యేక హెచ్చరిక వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఈ వ్యవస్థ ద్వారా కొన్ని వారాల ముందుగానే ప్రమాద ప్రాంతాలను గుర్తించి ఆరోగ్య శాఖ అప్రమత్తం కావచ్చని తెలిపారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, తక్కువ వర్షాలు ఉన్నాయనే నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం, జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా డెంగ్యూ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని సూచిస్తున్నారు. వాతావరణ మార్పులు -- డెంగ్యూ ప్రమాదం మధ్య ఉన్న ఈ కొత్త సంబంధం దేశ ప్రజారోగ్య వ్యవస్థకు కీలక హెచ్చరికగా మారింది. ఇకపై కేవలం వర్షాలనే కాకుండా ఎల్‌నినో ప్రభావాన్ని కూడా ఆరోగ్య శాఖలు నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.




## శుభ్రతే రక్షణ.. ఆరోగ్యమే మహాభాగ్యం.

బుచ్చిరెడ్డిపాలెం, నిర్భయవార్త ప్రతినిధి ;:.మండలంలో మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించేందుకు సఖిహబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం విశేష స్పందన పొందింది. అర్బన్ కోఆర్డినేటర్ కంచె శిరిషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ, అంటువ్యాధుల నివారణ, మానసిక ఆరోగ్యం వం టి కీలక అంశాలపై నిపుణులు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. అలాగే, పరిశుభ్రమైన జీవనశైలి అలవాటు చేసుకుంటే అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని సూచించారు. కుటుంబ ఆరోగ్యానికి మహిళలే కేంద్రబిందువని, ప్రతి మహిళ తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత మహిళల్లో ఆరోగ్య చైతన్యాన్ని మరింత పెంచుతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ అవగాహన కార్యక్రమం మహిళల్లో ఆరోగ్యంపై బాధ్యతను పెంపొందించడమే కాకుండా, పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి బాటలు వేస్తోందని నిర్వాహకులు తెలిపారు.



## ప్రతి ఓటు భవిష్యత్తును నిర్ణయిస్తుంది.




ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించిన తెలుగు యువనేత సురేష్.

పాడేరు, అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి ;:.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ ) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి లభించిన విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, మనం వేసే ఓటు మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడమే కాకుండా భావి తరాల భవిష్యత్తును కూడా నిర్ణయిస్తుందని తెలిపారు. అందువల్ల ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకుని, వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. గుత్తులపుట్టులో 60 శాతం, దబ్బాపుట్టులో 75 శాతం, గబ్బంగిలో 61 శాతం మేర ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తైందని తెలిపారు. మిగిలిన అర్హులందరినీ కూడా చేరుకునేలా ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమార్, అంగన్‌వాడీ కార్యకర్త రవణమ్మ, వీఓఏ సువర్ణ, వీఆర్‌పీ పూర్ణమణి తదితరులు పాల్గొన్నారు

## సీకరి గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని నమోదు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే చెట్టి. పాల్గుణ

పెదబయలు, పాడేరు అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి ;:. అల్లూరి జిల్లా పెదబయలు మండలం సీకరి గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ పాల్గొని తన ఓటరు నమోదును పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు, అవసరమైతే మార్పులు, చేర్పులు కూడా చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, పూర్తి స్థాయిలో ఉండేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని చెట్టి ఫాల్గుణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఎన్నికల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అందుబాటు ఆహారంలోనే పోషకాల ఖజానా



**ఈ** మధ్యకాలంలో ఆరోగ్యం గురించి ప్రజల్లో అవగాహన బాగా పెరిగింది. ఏది తినాలి? ఏది తినకూడదు? ఏ ఆహారం వల్ల బరువు తగ్గుతుంది? ఏది రోగనిరోధక శక్తిని పెంచుతుంది? వంటి విషయాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. అదే సమయంలో "సూపర్ ఫుడ్" అనే పదం కూడా బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. చియా గింజలు, క్వినోవా, అవకాడో, బ్లూబెర్రీలు, గ్రానోలా... ఇవన్నీ ఇప్పుడు ఆరోగ్యకరమైన ఆహారంగా ప్రచారం పొందుతున్నాయి. సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోలు, ప్రకటనలు, ఫిట్‌నెస్ సలహాలతో ఈ ఆహారాలపై ఆసక్తి పెరిగింది. దీంతో ఆరోగ్యంగా ఉండాలంటే ఇలాంటి ఖరీదైన ఆహారాలనే తప్పనిసరిగా తినాలనే అభిప్రాయం కూడా చాలామందిలో ఏర్పడుతోంది. అయితే పోషకాహార నిపుణులు మాత్రం దీనిని పూర్తిగా సమర్థించడం లేదు. శరీరానికి అవసరమైన పోషకాలు అందడం ముఖ్యమని, అవి ఎక్కడి నుంచి వస్తున్నాయన్నది అంత ముఖ్యమైన విషయం కాదని చెబుతున్నారు. మనకు అందుబాటులో, తక్కువ ధరకే లభించే అనేక ఆహారాల్లో కూడా అదే స్థాయి పోషక విలువలు ఉన్నాయని వివరిస్తున్నారు.

**సూపర్ ఫుడ్స్ అంటే ...**

వాస్తవానికి "సూపర్ ఫుడ్" అనే పదానికి శాస్త్రీయ నిర్వచనం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), భారత వైద్య పరిశోధన మండలి (ICMR), జాతీయ పోషకాహార సంస్థ (NIN) వంటి సంస్థలు ఈ పదాన్ని అధికారికంగా ఉపయోగించవు. ఇది ప్రధానంగా ఆహార పరిశ్రమ, మార్కెటింగ్ రంగంలో ప్రచారానికి ఉపయోగించే పదం. ఏదైనా ఆహారంలో ఒకటి లేదా రెండు పోషకాలు ఎక్కువగా ఉంటే దానిని "సూపర్ ఫుడ్"గా ప్రచారం చేస్తారు. కానీ ఆరోగ్యం ఒక్క ఆహార పదార్థంతో రాదు. కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచు పదార్థం, విటమిన్లు, ఖనిజ లవణాలు, తగినంత నీరు, క్రమమైన వ్యాయామం, సరిపడా నిద్ర... ఇవన్నీ కలిసి ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. అందుకే ఏ ఒక్క ఆహారాన్నీ అద్భుత ఔషధంలా భావించకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

**మన ప్రత్యామ్నాయాలు**

ఎంతో ప్రచారం పొందుతున్న విదేశీ ఆహారాల్లో ఉండే పోషకాలకు మనకు సులభంగా దొరికే ప్రత్యామ్నాయాలు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు క్వినోవాను అధిక ప్రోటీన్, పీచు పదార్థం కలిగిన ధాన్యంగా ప్రచారం చేస్తారు. అయితే కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాల్లో కూడా మంచి మోతాదులో ప్రోటీన్లు, పీచు పదార్థం, బి-విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. చియా గింజల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయని చెబుతారు. అదే ఒమేగా-3 మన దగ్గర సులభంగా దొరికే అవిసె గింజల్లో కూడా సమృద్ధిగా ఉంటుంది. నువ్వులు కాల్షియం, ఇనుము, మంచి కొవ్వులకు నిలయం. వేరుశెనగల్లో ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్-ఇ లభిస్తాయి.

అవకాడోలో మంచి కొవ్వులు, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. అయితే వేరుశెనగలు, బాదం, జీడిపప్పు, కొబ్బరి కూడా ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. పొటాషియం విషయానికి వస్తే అరటిపండు, బొప్పాయి, జామపండు కూడా మంచి వనరులే. బ్లూబెర్రీలను యాంటీఆక్సిడెంట్ల కోసం ఎక్కువగా తింటారు. మన దగ్గర లభించే ఉసిరికాయ, నేరేడు, దానిమ్మ, నల్ల ద్రాక్షల్లో కూడా శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఉసిరికాయలో విటమిన్-సి మోతాదు చాలా ఎక్కువ. విదేశాల్లో ప్రాచుర్యం పొందిన కేల్ ఆకుకూరలో విటమిన్-ఎ, కాల్షియం, ఇనుము ఎక్కువగా ఉంటాయి. అదే పోషకాలు మన మునగాకు, పాలకూర, తోటకూర, బచ్చలికూరల్లో సమృద్ధిగా లభిస్తాయి. అందుకే పోషకాహారం కోసం విదేశీ పదార్థాలపైనే ఆధారపడాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు.

**ఆరోగ్య సూత్రం**

ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత వైద్య పరిశోధన మండలి, జాతీయ పోషకాహార సంస్థలు ఒకే విషయాన్ని నొక్కి చెబుతున్నాయి. రోజూ వివిధ రకాల ధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాల ఉత్పత్తులు సమతులంగా తీసుకోవాలి. ఒకే రకమైన ఆహారంపై ఆధారపడకూడదు. మన రోజువారీ భోజనాన్ని గమనిస్తే ఒక సమతుల పోషకాహార నమూనా కనిపిస్తుంది. అన్నం, పప్పు, ఒక కూర, ఒక ఆకుకూర, పెరుగు లేదా మజ్జిగ, కాలానుగుణంగా ఒక పండు - ఈ కలయికలో శరీరానికి అవసరమైన చాలా పోషకాలు లభిస్తాయి. ఇదే ఆధునిక పోషకాహార శాస్త్రం సూచిస్తున్న "సమతుల ఆహారం". అందుకే ఆహారంలో వైవిధ్యం ఉండాలి కానీ, ఆ వైవిధ్యం ఖరీదైన దిగుమతి ఆహారాలతోనే రావాలనే నియమం లేదు. పోషకాహారం అనేది ధరతో నిర్ణయించబడదు. శరీరానికి అవసరమైన పోషకాలు సమతులంగా అందుతున్నాయా లేదా అన్నదే అసలు ప్రమాణం. అందుకే ఆహారం ఎంపికలో ప్రకటనల కంటే శాస్త్రీయ అవగాహనకు ప్రాధాన్యం ఇస్తే - ఆరోగ్యం కూడా బాగుంటుంది, ఖర్చు కూడా అదుపులో ఉంటుంది.



## బాత్రూమ్ అద్దంపై మరకలు ఇలా పోగొట్టుకోవాలి..

**బా**త్రూమ్‌లోని అద్దాలు, షవర్ గ్లాస్‌లను ప్రతిరోజూ శుభ్రం చేస్తున్నా వాటిపై తెల్లటి మరకలు పేరుకుపోతుంటాయి. ఈ మరకల కారణంగా అద్దం మసకబారిపోయి పాతదిగా కనిపిస్తుంది. ఈ మరకలకు ప్రధాన కారణం గట్టి నీరు (హార్డ్ వాటర్). ఈ నీటిలో ఉండే కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు నీరు ఆరిపోయిన తర్వాత గాజు ఉపరితలంపై పేరుకుపోతాయి. రోజులు గడిచేకొద్దీ ఈ ఖనిజాల పొర మందంగా మారి అద్దం మెరుపును తగ్గిస్తుంది. ఇంట్లోనే సులభంగా దొరికే కొన్ని పదార్థాలతో ఈ మరకలను తొలగించవచ్చు.

**క్లీనింగ్ స్ప్రే ఇలా తయారు చేసుకోవచ్చు :**

ఒక స్ప్రే బాటిల్‌లో సగం వరకు శుభ్రమైన నీటిని పోయాలి. అందులో 2 నుంచి 3 చుక్కల డిష్‌వాషింగ్ లిక్విడ్ వేసి, మిగిలిన భాగాన్ని తెల్ల వెనిగర్‌తో నింపాలి. ఇప్పుడు అద్దంపై మరకలు ఉన్న చోట గోరువెచ్చని నీరు పోయాలి. తరువాత తయారు చేసిన క్లీనింగ్ స్ప్రేను మొత్తం ఉపరితలంపై చల్లి 10 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత మరోసారి స్ప్రే చేసి స్పాంజ్ లేదా మెత్తని బ్రష్‌తో గుండ్రంగా రుద్దాలి. చివరగా గోరువెచ్చని నీటితో కడిగి, మైక్రోఫైబర్ వస్త్రంతో పూర్తిగా తుడవాలి.

**మొండి మరకలను ఇలా తొలగించాలి :**

అద్దాన్ని వేడి నీటితో శుభ్రం చేయాలి. ఆ తర్వాత క్లీనింగ్ స్ప్రేను చల్లి 10 నుంచి 15 నిమిషాలు అలాగే ఉంచాలి. అనంతరం స్పాంజ్‌తో మెల్లగా గుండ్రంగా రుద్దాలి. చివరగా గోరువెచ్చని నీటితో కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. ఇదే ప్రక్రియను మరకలు పోయేంతవరకు పదే పదే చేయాలి.

**ఇవి కూడా పనిచేస్తాయి..**

- గోరువెచ్చని వెనిగర్‌ను గాజుపై స్ప్రే చేసి, వెనిగర్‌లో తడిపిన పేపర్ టవల్‌ను 10 నుంచి 20 నిమిషాలు ఉంచాలి. తర్వాత బేకింగ్ సోడా, నీటితో తయారు చేసిన పేస్ట్‌ను బ్రష్‌తో రుద్ది కడిగేయాలి.
- మరకలపై తెల్లటి టూత్‌పేస్ట్‌ను పూసి 10 నుంచి 15 నిమిషాలు ఉంచాలి. తర్వాత తడి స్పాంజ్‌తో రుద్ది శుభ్రం చేస్తే మరకలు తగ్గుతాయి.
- సగం నిమ్మకాయను ఉప్పులో ముంచి గాజుపై గుండ్రంగా రుద్దాలి. ఆ తరువాత నీటితో కడిగి ఆరనివ్వాలి.
- అల్యూమినియం ఫాయిల్‌ను చిన్న ఉండలా చుట్టి, క్లీనింగ్ ద్రావణం స్ప్రే చేసిన గాజుపై మెల్లగా రుద్దాలి. గాజు తడిగా ఉండేలా చూసుకోవాలి. లేకపోతే గీతలు పడే అవకాశం ఉంటుంది.
- వారానికి కనీసం ఒకసారి వెనిగర్ క్లీనింగ్ స్ప్రేతో అద్దాన్ని శుభ్రం చేస్తే ఖనిజాల పొర పేరుకుపోకుండా ఉంటుంది.

**మరకలు మళ్లీ రాకుండా..**

స్నానం చేసిన వెంటనే షవర్ గ్లాస్ లేదా అద్దంపై ఉన్న నీటిని తుడిచివేయాలి. ప్రతిరోజూ మైక్రోఫైబర్ వస్త్రం లేదా స్క్వీజీతో గాజును శుభ్రం చేస్తే మరకలు ఏర్పడే అవకాశం తగ్గుతుంది.

## ప్రిజర్వేటివ్స్ ఉన్న ఆహారాలను అధికంగా తీసుకుంటే గుండె జబ్బుల ముప్పు.. అధ్యయనంలో వెల్లడి..

గుండె జబ్బులు ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా కొనసాగుతున్నాయి. ఆహారపు అలవాట్లు గుండె ఆరోగ్యంపై కీలక ప్రభావం చూపుతాయని ఇప్పటికే అనేక అధ్యయనాలు వెల్లడించాయి. ప్రిజర్వేటివ్స్ ఉన్న ఆహారాలను అధికంగా తీసుకుంటే గుండె జబ్బుల ముప్పు.. అధ్యయనంలో వెల్లడి..గుండె జబ్బులు ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా కొనసాగుతున్నాయి. ఆహారపు అలవాట్లు గుండె ఆరోగ్యంపై కీలక ప్రభావం చూపుతాయని ఇప్పటికే అనేక అధ్యయనాలు వెల్లడించాయి. తాజాగా నిర్వహించిన ఓ పరిశోధనలో ప్రాసెస్డ్ ఆహారాల్లో ఉపయోగించే కొన్ని సాధారణ ప్రిజర్వేటివ్‌లు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచే అవకాశముందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఫ్రాన్స్‌కు చెందిన న్యూట్రినెట్-సాంటే పరిశోధనలో లక్ష మందికిపైగా వ్యక్తులను పరిశీలించారు. ఈ ఏడాది మే 20న ప్రచురితమైన ఈ అధ్యయనంలో కొన్ని ఆహార ప్రిజర్వేటివ్‌లకు ఎక్కువగా గురైన వారిలో గుండె సంబంధిత వ్యాధులు, రక్తపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది.

**ఏయే ప్రిజర్వేటివ్‌లను గుర్తించారు..**

పరిశోధకులు గుండె ఆరోగ్యానికి సంబంధం ఉన్న 8 సాధారణ ప్రిజర్వేటివ్‌లను గుర్తించారు. అవి పొటాషియం సోర్బేట్ (ఐ202), పొటాషియం




మెటాబైసల్ఫైట్ (ఐ224), సోడియం నైట్రైట్ (ఐ250), ఆస్కార్బిక్ యాసిడ్ (ఐ300), సోడియం ఆస్కార్బేట్ (ఐ301), సోడియం ఎరిథార్బేట్ (ఐ316), సిట్రిక్ యాసిడ్ (ఐ330), రోజ్‌మేరీ ఎక్స్‌ట్రాక్ట్ (ఐ392). ఈ ప్రిజర్వేటివ్‌లకు అత్యధికంగా గురైన వ్యక్తుల్లో రక్తపోటు వచ్చే ప్రమాదం 29 శాతం ఎక్కువగా ఉండగా, గుండెపోటు, స్ట్రోక్, యాంజైనా వంటి గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం 16 శాతం అధికంగా ఉన్నట్లు పరిశోధనలో వెల్లడైంది. ప్రిజర్వేటివ్‌లను ఆహార పదార్థాల నిల్వకాలాన్ని పెంచేందుకు, వాటి నాణ్యతను కాపాడేందుకు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్యాకెట్ స్నాక్స్, ప్రాసెస్డ్ మాంసాహార ఉత్పత్తులు, బేకరీ పదార్థాలు, సాస్‌లు, రెడీ-టు-ఈట్ ఆహారాలు, పానీయాలు వంటి అనేక పారిశ్రామికంగా తయారైన ఆహారాల్లో ఇవి సాధారణంగా ఉంటాయి.

**సహజసిద్ధమైన, తాజా ఆహారం తీసుకోవాలి..**

ఈ అధ్యయనంలో పాల్గొన్న వారందరూ ఏదో ఒక స్థాయిలో ఈ ప్రిజర్వేటివ్‌లకు గురయ్యారని పరిశోధకులు పేర్కొన్నారు. అయితే ఈ ఫలితాలు ప్రిజర్వేటివ్‌లు నేరుగా గుండె జబ్బులకు కారణమని నిర్ధారించడం కాదు. వీటి మధ్య సంబంధం ఉందని మాత్రమే అధ్యయనం సూచించింది. ఈ అంశంపై మరింత లోతైన పరిశోధనలు అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాల వినియోగాన్ని తగ్గించి, తాజా కూరగాయలు,
పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి సహజ ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం మంచిది. అలాగే ఆహార పదార్థాలపై ఉండే లేబుళ్లను చదివి అందులోని ప్రిజర్వేటివ్‌లు, ఇతర సంకలనాల గురించి తెలుసుకోవడం కూడా ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలకు ఉపయోగపడుతుంది.

## మినీ స్ట్రోక్.. ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు

మాట్లాడటంలో ఇబ్బంది, చేతులు లేదా కాళ్లలో అకస్మాత్తుగా బలహీనత, కొద్దిసేపు చూపు మసకబారడం వంటి లక్షణాలు కనిపించి... కొన్ని నిమిషాల్లో తగ్గిపోతే వాటిని చిన్న సమస్యగా తీసుకోవద్దు. ఇవి మినీ స్ట్రోక్ లేదా ట్రాన్సియెంట్ ఇస్కీమిక్ అటాక్ (౧×యా) సంకేతాలు కావచ్చు. ఇది భవిష్యత్తులో వచ్చే తీవ్రమైన స్ట్రోక్‌కు ముందస్తు హెచ్చరికగా భావిస్తారు.

**మినీ స్ట్రోక్ అంటే ఏమిటి?**




మెదడులోని ఒక భాగానికి కొద్దిసేపు రక్తప్రసరణ తగ్గిపోవడం లేదా ఆగిపోవడం వల్ల మినీ స్ట్రోక్ వస్తుంది. లక్షణాలు కొన్ని నిమిషాలు లేదా గంటలోపే తగ్గిపోయినా, ప్రమాదం పూర్తిగా తొలగిపోయిందని భావించకూడదు. సరైన చికిత్స తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్ద స్ట్రోక్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

**మినీ స్ట్రోక్ లక్షణాలు**

ముఖం ఒకవైపు వాలిపోవడం ఒక చేయి లేదా కాలు బలహీనంగా అనిపించడం లేదా స్పర్శ తగ్గిపోవడంమాట్లాడటంలో లేదా ఇతరులు చెప్పేది అర్థం చేసుకోవడంలో ఇబ్బంది ఒకటి లేదా రెండు కళ్లలో చూపు మసకబారడం లేదా తగ్గిపోవడం

అకస్మాత్తుగా తలతిరగడం, సమతుల్యత కోల్పోవడం కారణం లేకుండా తీవ్రమైన తలనొప్పి ఈ లక్షణాలు కొద్దిసేపటికే తగ్గిపోయినా వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి.

**ఎవరికి ప్రమాదం ఎక్కువ?**

అధిక రక్తపోటు ఉన్నవారు మధుమేహం ఉన్నవారు అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు ధూమపానం చేసేవారు ఊబకాయంతో బాధపడేవారు గుండె జబ్బులు ఉన్నవారు 55 సంవత్సరాలు పైబడినవారు కుటుంబంలో స్ట్రోక్ చరిత్ర ఉన్నవారుస్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనది. లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి చేరుకుంటే మెదడుకు కలిగే నష్టాన్ని తగ్గించే చికిత్స అందించే అవకాశం ఉంటుంది.

**మినీ స్ట్రోక్‌ను ఎలా నివారించాలి?**

రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి.ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.

రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి.ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి.వైద్యుడు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.మినీ స్ట్రోక్ వచ్చిన అనుమానం ఉంటే ఆలస్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

# సినిమా సిత్రం

## క్లైమాక్స్ దశలో వారణాసి..
## సెట్స్‌పై మరో భారీ యుద్ధానికి సన్నాహాలు

భారతీయ సినిమా గురించి ప్రపంచవ్యాప్తంగా డిస్కషన్ జరిగినప్పుడు తప్పకుండా వినిపించే పేర్లలో ఎస్.ఎస్. రాజమౌళి ఒకరు. భారతీయ సినిమా గురించి ప్రపంచవ్యాప్తంగా డిస్కషన్ జరిగినప్పుడు తప్పకుండా వినిపించే పేర్లలో ఎస్.ఎస్. రాజమౌళి ఒకరు. అంతర్జాతీయ వేదికలపై వరుస గౌరవాలు అందుకుంటూనే, మరోవైపు తన కొత్త ప్రాజెక్ట్ వారణాసిని పూర్తి చేసే దిశగా ఆయన వేగంగా అడుగులేస్తున్నారు. విదేశాల్లో ప్రశంసలు అందుకున్న వెంటనే మళ్లీ షూటింగ్‌పై పూర్తి దృష్టి పెట్టడం రాజమౌళి పని తీరుకు మరో ఉదాహరణగా మారింది.



ప్రస్తుతం వారణాసి ప్రొడక్షన్ కీలక దశలోకి చేరింది. షూటింగ్ లో ఎక్కువ భాగం పూర్తవడంతో, మిగిలిన షెడ్యూళ్లను వేగంగా పూర్తి చేసేలా మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్‌కు కూడా తగిన సమయం కేటాయించేలా షెడ్యూలింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, ఇంటర్నేషనల్ రేంజ్ టెక్నికల్ వర్క్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్న నేపథ్యంలో, షూటింగ్ పూర్తయ్యాక కూడా దీర్ఘకాలిక పోస్ట్ ప్రొడక్షన్ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది. టార్గెట్ గా పెట్టుకున్న రిలీజ్ డేట్ కు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రతి దశను ముందుగానే ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రాబోయే షెడ్యూల్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. వేలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో రూపొందించనున్న భారీ యుద్ధ ఘట్టం ఈ షెడ్యూల్‌లో మెయిన్ ఎట్రాక్షన్ గా ఉండనుంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు తెరకెక్కిన అతిపెద్ద వార్ ఎపిసోడ్స్‌లో ఒకటిగా నిలిచేలా జక్కన్న దీన్ని రూపొందిస్తున్నారని సమాచారం. సెట్స్‌పై షూట్ చేసే ఈ సీన్ ను తరువాత అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లే ప్రణాళిక కూడా ఉందని తెలుస్తోంది. రాజమౌళి సినిమాల భారీ కాన్వాస్‌ను ఈ ఎపిసోడ్ మరోసారి గుర్తు చేయబోతోందనే అంచనాలు ఈ వార్ ఎపిసోడ్‌పై ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఫ్రాన్స్ పర్యటనలో రాజమౌళికి లభించిన గౌరవం భారతీయ సినీ పరిశ్రమకు మరో గుర్తింపుగా నిలిచింది. ఆయన సినిమాల స్పెషల్ స్క్రీనింగ్స్, సినీ స్టూడెంట్స్ మరియు ఆడియన్స్ తో నిర్వహించిన చిట్‌చాట్స్, మాస్టర్ క్లాసులకు వచ్చిన రెస్పాన్స్ ఇండియన్ స్టోరీలపై అంతర్జాతీయ ఆసక్తి ఎంతగా పెరిగిందో మరోసారి చూపించింది. తెలుగు భాషలో రూపొందిన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతున్నాయనే విషయానికి ఇది బలమైన నిదర్శనంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు

## సీక్వెల్స్‌కు పెరుగుతున్న లీగల్ చిక్కులు..
## క్వీన్2 కూడా అదే బాటలో?

కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ సీక్వెల్ ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి వెళ్లినట్లు సమాచారం. ఒక సినిమా సక్సెస్ సాధించిన వెంటనే దానికి సీక్వెల్ అనౌన్స్ చేయడం ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో చాలా సాధారణ విషయంగా మారిపోయింది. అయితే కథను ముందుకు తీసుకెళ్లడం ఎంత ముఖ్యమో, ఆ సినిమాకు సంబంధించిన ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ను చట్టపరంగా క్లియర్ చేసుకోవడం కూడా అంతే కీలకం. ఇటీవలి కాలంలో పలు సినిమాలు ఈ అంశంలో వివాదాలను ఎదుర్కొన్నాయి. ఇప్పుడదే తరహా పరిస్థితి కంగనారనౌత్ నటిస్తున్న క్వీన్2 చుట్టూ కూడా నెలకొనడం ఇండస్ట్రీలో హాట్ డిస్కషన్ పాయింట్ గా మారింది.



కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ సీక్వెల్ ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి వెళ్లినట్లు సమాచారం. సాధారణంగా ఈ దశలో మేకర్స్ రిలీజ్ డేట్ పై దృష్టి పెడతారు. కానీ ప్రస్తుతం నెలకొన్న లీగల్ వివాదం కారణంగా సినిమా జర్నీ అనుకున్న విధంగా సాగుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సినిమా నిర్మాణం పూర్తయిన తర్వాత లీగల్ ఇష్యూలు తెరపైకి రావడం నిర్మాతలకు ఆర్థికంగానే కాకుండా రిలీజ్ ప్లాన్స్ పరంగా కూడా పెద్ద సవాలుగా మారుతుంది. కోర్టు విచారణ కొనసాగుతున్న టైమ్ లో రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయాలా లేదా వెయిట్ చేయాలా అనే సందిగ్ధ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది. ఒకవేళ లీగల్ ప్రాసెస్ ఎక్కువ కాలం కొనసాగితే ప్రమోషన్ క్యాలెండర్, థియేట్రికల్ ప్లానింగ్, డిస్ట్రిబ్యూషన్ డీల్స్ పై కూడా ప్రభావం పడే అవకాశాన్ని ట్రేడ్ వర్గాలు చర్చిస్తున్నాయి. ఇటీవలి సంవత్సరాల్లో సీక్వెల్స్, ఫ్రాంచైజీల సంఖ్య పెరిగిన కొద్దీ వాటికి సంబంధించిన హక్కులపై వివాదాలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఒక సినిమాకు పలువురు భాగస్వాములు ఉన్న సందర్భాల్లో సీక్వెల్ హక్కులు, క్రియేటివ్ కంట్రోల్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ వంటి అంశాలు కోర్టుల వరకు వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుకే ఇప్పుడు ప్రతి పెద్ద నిర్మాణ సంస్థ అగ్రిమెంట్స్ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. క్వీన్2 విషయంలో కూడా అసలు డిస్కషన్ సినిమా కథ కంటే దాని రైట్స్ చుట్టూనే తిరుగుతోంది. ఈ వివాదం ఎప్పుడు పరిష్కారమవుతుందనే దానిపైనే రిలీజ్ షెడ్యూల్ ఆధారపడే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నప్పటికీ, న్యాయపరమైన పరిణామాలు పూర్తయ్యే వరకు అఫీషియల్ రిలీజ్ ప్లానింగ్ పై క్లారిటీ వచ్చే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. సెట్స్‌పై మరో భారీ యుద్ధానికి సన్నాహాలు ఇదిలా ఉండగా, ఈ వివాదంపై కంగనా రనౌత్ ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఆమె రియాక్షన్ కోసం ఫ్యాన్స్ తో పాటూ బాలీవుడ్ వర్గాలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. హీరోయిన్ ఈ విషయంపై రియాక్ట్ అయితే, వివాదానికి సంబంధించిన డిస్కషన్ మరో మలుపు తిరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, క్వీన్2 చుట్టూ నెలకొన్న పరిణామాలు ఈ ఒక్క సినిమా భవితవ్యానికే పరిమితం కాకుండా, ఫ్యూచర్ లో రూపొందే సీక్వెల్స్‌కు సంబంధించిన లీగల్ ప్రాసెస్ ను మరింత కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోందని ఇండస్ట్రీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## టికెట్ రేట్లా? పాప్‌కార్న్ రేట్లా?..

మళ్లీ అదే చర్చ.. థియేటర్ లో పాప్ కార్న్ కొనాలా వద్దా అనేది ఆడియన్స్ ఇష్టమని, కానీ మూవీ చూడాలంటే మాత్రం టికెట్ కంపల్సరీగా కొనాల్సిందేనని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. సినిమా థియేటర్లలో ప్రేక్షకుల సంఖ్య తగ్గడానికి అసలు కారణం ఏంటి? టికెట్ ధరలా? లేక పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ వంటి బేవరేజస్ ధరలా? ఈ అంశంపై మరోసారి చర్చ మొదలైంది. నిర్మాత నాగవంశీ చేసిన లేటెస్ట్ కామెంట్స్ తో సోషల్ మీడియాలో ఆ విషయం హాట్ టాపిక్‌గా మారింది. ప్రేక్షకులు మాత్రం సమస్య ఒక్కటే కాదని, టికెట్ ధరలు, థియేటర్ లోని ఫుడ్ రేట్లు రెండూ సామాన్యుడిపై భారం పెడుతున్నాయని అభిప్రాయపడుతున్నారు.



లెనిన్ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా నాగవంశీ మాట్లాడుతూ.. "టికెట్ రేటు ఎక్కువగా ఉందని సినిమాకు వెళ్లడం మానేసిన వాళ్లు ఎక్కువా? లేక లోపల పాప్ కార్న్, వాటర్ బాటిల్ ధరలు ఎక్కువగా ఉండటంతో వెళ్లడం మానేసిన వాళ్లు ఎక్కువా? దీనిపై ఒక సర్వే చేస్తే అసలు విషయం తెలుస్తుంది. నేను ఎవరినీ విమర్శించడం లేదు. నా అభిప్రాయాన్ని మాత్రమే చెబుతున్నాను" అని అన్నారు. ఆ వ్యాఖ్యలతో చర్చ మళ్లీ మొదలైంది. సోషల్ మీడియాలో మాత్రం దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. థియేటర్ లో పాప్ కార్న్ కొనాలా వద్దా అనేది ఆడియన్స్ ఇష్టమని, కానీ మూవీ చూడాలంటే మాత్రం టికెట్ కంపల్సరీగా కొనాల్సిందేనని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా భారీ సినిమాల విడుదల సమయంలో స్పెషల్ పర్మిషన్లతో టికెట్ ధరలు పెంచడం వల్ల ఫ్యామిలీ ఆడియన్స్ పై ఎక్స్ ట్రా భారం పడుతోందని నెటిజన్లు చెబుతున్నారు. ఇక మల్టీప్లెక్సుల్లో ఫుడ్ అండ్ బెవరేజస్ ధరలు కూడా చాలాకాలంగా విమర్శలకు గురవుతున్నాయి. బయట తక్కువ ధరకు లభించే పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ థియేటర్లలో పలుమార్లు ఎక్కువ ధరకు విక్రయిస్తుండటంపై ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక కుటుంబం సినిమా చూడటానికి వెళ్లితే టికెట్లతో పాటు ఆహార పదార్థాల ఖర్చు కూడా కలిపి మొత్తం వ్యయం భారీగా పెరుగుతోందని అంటున్నారు. దీంతో కొంతమంది థియేటర్లకు వెళ్లకుండా ఓటీటీలో సినిమా వచ్చే వరకు వేచి చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు థియేటర్ల యాజమాన్యాలు మాత్రం తమకు టికెట్ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో పెద్ద భాగం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకే వెళ్తుందని చెబుతున్నాయి. నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు వంటి వ్యయాలను భర్తీ చేయడానికి ఫుడ్ అండ్ బెవరేజస్ విక్రయాలే మెయిన్ సోర్స్ గా మారాయని వారి వాదన. ఆ అంశంపై ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు కూడా స్పందించారు. థియేటర్లలో బేవరేజస్ రేట్లు తగ్గితే ఫ్యామిలీ ఆడియన్స్ మరింతగా థియేటర్లకు వస్తారని కొందరు అంటుండగా, మరికొందరు టికెట్ రేట్లు కూడా తగ్గించాలని సూచించారు. ఏదేమైనా టికెట్ రేట్లు, పాప్ కార్న్ ధరలు అనే రెండు అంశాలూ ఇప్పుడు మళ్లీ హాట్ టాపిక్ గా మారాయి.

## మెంటల్ మాస్ యాక్షన్ ఎపిసోడ్ లో 'మెగా 158'




ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు కొల్లి బాబీ కలయికలో భారీ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. వాల్తేరు వీరయ్య బ్లాక్ బస్టర్ తర్వాత వీరి కలయికలో వస్తున్న సినిమా ఇది కావడంతో మరిన్ని అంచనాలు నెలకొన్నాయి. పైగా డాకు మహారాజ్ లాంటి క్వాలిటీ ప్రాడెక్టు తర్వాత బాబీ నుంచి సినిమా కావడంతో టాలీవుడ్ ఆడియెన్స్ మరింత ఎగ్జైటెడ్ గా ఉన్నారు. ఇలా స్టార్ట్ అయ్యిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ షూటింగ్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్ లో దూసుకెళుతుంది. కొన్ని రోజులు కితమే పొలాచ్చిలో మొదటి షెడ్యూల్ స్టార్ట్ చేసుకున్న ఈ సినిమా ఇప్పుడు హైదరాబాద్ లో జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. ఇక ఈ షూట్ లో ఓ మెంటల్ మాస్ యాక్షన్ ఎపిసోడ్ ని ఫైట్ మాస్టర్స్ రామ్, లక్షణ్ లు డిజైన్ చేసినట్టు తెలుస్తుంది. గూస్ బంప్స్ ఇచ్చే రేంజ్ లో ఈ ఎపిసోడ్ ఉంటుందట. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా కే వి ఎన్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## ఇంట్రెస్టింగ్.. వీక్ డేస్ లో కూడా 'నాగ బంధం' ట్రెండింగ్!




లేటెస్ట్ గా టాలీవుడ్ నుంచి రిలీజ్ కి వచ్చిన చిత్రాల్లో భారీ చిత్రం 'నాగ బంధం' కూడా ఒకటి. యంగ్ హీరో విరాట్ కర్ణ హీరోగా నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్స్ గా దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించిన ఈ భారీ స్కేల్ డివోషనల్ డ్రామా విడుదలకి ముందు మంచి బజ్ ని సొంతం చేసుకుంది. ఇలా థియేటర్స్ లోకి సాలిడ్ బుకింగ్స్ తోనే వచ్చిన ఈ సినిమా టాక్ మాత్రం మిక్స్ గా అందుకుంది. ఈ నేపథ్యంలో సినిమా రన్ వీకెండ్ కి అయిపోతుంది అని చాలా మంది అనుకున్నారు కానీ ఇంట్రెస్టింగ్ గా ఈ సినిమా రన్ వీక్ డేస్ లో కూడా కొనసాగుతుంది. బుక్ మై షో టికెట్ సేల్స్ ట్రెండింగ్ లో ఈ సినిమా మంగళవారం కూడా కనిపించడం గమనార్హం. దీనితో మరీ తక్కువ అంచనా వేసినవారికి నాగ బంధం ఊహించని సమాధానమే ఇచ్చింది అని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రంకి ఇక ఈ సినిమాకి జునైద్ కుమార్, అభే లు సంగీతం అందించగా కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మాణం వహించారు.

## పారిస్ బ్యాక్‌డ్రాప్‌లో స్టన్నింగ్ లుక్...





డియోర్ డ్రెస్సులో ప్రియాంక చోప్రా గ్లోబల్ ఐకాన్ ప్రియాంకా చోప్రా జోనాస్ తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. గ్లోబల్ ఐకాన్ ప్రియాంకా చోప్రా జోనాస్ తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. పారిస్ నగర అందాల బ్యాక్‌డ్రాప్‌లో ఆమె దిగిన కొన్ని స్టన్నింగ్ ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తున్నాయి. హై ఫ్యాషన్, సమ్మర్ ఎలిగాన్స్ కలబోసినట్లున్న ఈ డియోర్ అవుట్‌ఫిట్ లుక్‌లో ప్రియాంక గ్లోబల్ రేంజ్ మెరుపులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న ఆ అదిరిపోయే లగ్జరీ లుక్ విశేషాలు గురించి చూద్దాం..పారిస్ బాల్కనీలో కలర్‌ఫుల్ మెరుపులు: ఈ ఫొటోషూట్‌లో ప్రియాంకా చోప్రా స్టైలింగ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంది. పారిస్‌లోని సాంప్రదాయ క్లాసిక్ బాల్కనీపై నిలబడి, అక్కడి అందమైన బిల్డింగుల బ్యాక డ్రాప్‌లో ఆమె పోజులిచ్చింది. ఒక వైబ్రంట్ ఆరెంజ్ కలర్ పెటల్ ఎంబెల్లిష్డ్ మినీ డ్రెస్‌లో ప్రియాంక ఎంతో అందంగా మెరిసిపోతోంది. ఇక ఒక భుజంపైకి వేసుకున్న పొడవాటి అలల జుట్టు, ముఖంలో కాన్ఫిడెంట్ గ్లో, ఆకర్షణీయమైన పోయిజ్‌తో ఆమె హై ఫ్యాషన్ లుక్‌ను పర్‌ఫెక్ట్‌గా ప్రెజెంట్ చేసిందిడియోర్ క్రియేషన్‌కు అదిరిపోయే ట్రిబ్యూట్: ఈ అద్భుతమైన డియోర్ క్రియేషన్‌ను డిజైన్ చేసిన జొనాథన్ ఆండర్సన్‌కు ప్రియాంక తన స్టైలిష్ ట్రిబ్యూట్ అందించింది. ఈ డ్రెస్‌కు ఉన్న ఫ్లోరల్ టెక్చర్స్, దానికి మ్యాచ్ చేస్తూ చేతిలో పట్టుకున్న వెరాన్ కలర్ హ్యాండ్‌బ్యాగ్, అలాగే సింపుల్ గోల్డ్ జ్యువెలరీ ఆమె లుక్‌కు మరింత రాయల్ టచ్ ఇచ్చాయి. ఇక 'ఇది చాలా అద్భుతం' అంటూ ఈ సరికొత్త కలెక్షన్‌ను ఆమె అభినందించిన తీరు ఫ్యాషన్ ప్రియులను ఫిదా చేస్తోంది. మిస్ వరల్డ్ నుండి హాలీవుడ్ స్టార్ వరకు: 2000 సంవత్సరంలో మిస్ వరల్డ్‌గా నిలిచిన ప్రియాంకా చోప్రా, ఆ తర్వాత 'తమిళన్' (2002) అనే తమిళ సినిమాతో నటిగా తన ప్రయాణాన్ని స్టార్ట్ చేసింది. బాలీవుడ్‌లో 'ఫ్యాషన్' సినిమాకు నేషనల్ అవార్డ్ అందుకోవడమే కాకుండా బర్ఫీ, మేరీ కోమ్, బాజీరావ్ మస్తానీ వంటి చిత్రాలతో టాప్ స్టార్‌గా ఎదిగింది. ఆ తర్వాత హాలీవుడ్‌లో 'క్వాంటికో', 'బేవాచ్' వంటి ప్రాజెక్టులతో గ్లోబల్ లెవెల్‌లో తన జెండా పాతేసింది. ప్రస్తుతం ప్రియాంక చేతిలో భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. కార్ల్ అర్బన్‌తో కలిసి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ఈ ఏడాది రిలీజ్ అయిన 'ది బ్లఫ్' తో పాటు గత ఏడాది 'హెడ్స్ ఆఫ్ స్టేట్', బాలీవుడ్ చిత్రం 'జీ లే జరా' మూవీ లో నటించి మెప్పించారు. ఇక ఇప్పుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' లో కూడా నటిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197